ప్రజాశక్తి

మంగళవారం 6 ఫిబ్రవరి 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

కట్టింది లేదు... ఇచ్చింది లేదు

- అగమ్యగోచరంగా టిడ్కో గృహాలు
- నిధుల మంజూరు నుంచి వైదొలగిన ప్రభుత్వం
- రుణాల కోసం బ్యాంకర్లను ఆశ్రయించాలని నిర్ణయం
- ఎన్టీఆర్ జిల్లాలో 11,520 గృహాలు మంజూరు

ప్రజాశక్తి-విజయవాడ ప్రతినిధి

ఎన్టీఆర్ జిల్లాలో టిడ్కో గృహాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా నిర్మాణాలు పూర్తి చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందింది. అప్పులు చేసి వాటా చెల్లించిన లబ్ధిదారులకు చివరికి వడ్డీలే మిగులుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని నాలుగు మునిసిపాలిటీల్లో టిడ్కో గృహాలను పేదలకు కట్టించి ఇవ్వాలని నిర్ణయించారు. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌తో పాటు మరో మూడు మునిసిపాలిటీలతో కలిపి మొతం11,520 టిడ్కో గృహాలను నిర్మించి లబ్ధిదారులకు ఇవ్వాలని గతంలో నిర్ణయించారు. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కింద 6,576, నందిగామ మునిసిపాలిటీ 240, జగ్గయ్యపేట పరిధిలో 3,168, తిరువూరు మునిసిపాలిటీ 1,536 గృహాలను కట్టించి పేద ప్రజలకు అందించాలని గతంలో భావించారు. అయితే ఎక్కడా గృహాలు నిర్మించి లబ్ధిదారులకు అందించిన దాఖలాల్లేవు.

బాధ్యతల నుంచి వైదొలగిన ప్రభుత్వం

లబ్ధిదారుల వాటా కింద వేల రూపాయలు జమ చేసుకున్న ప్రభుత్వం వీటి నిర్మాణాలకు వ్యయం అయ్యే నిధులను మంజూరు చేయాలనే బాధ్యతల నుంచి తప్పుకుంది. ఆర్థిక భారం అవుతుందని రుణాల రూపంలో తీసుకొని రావాలని ఆలోచన చేసింది. దీని కోసం బ్యాంకులను ఆశ్రయించాలని నిర్ణయించింది. విఎంసి పరిధిలోని గృహాల నిర్మాణాలకు 189.82 కోట్లు రుణాల కోసం బ్యాంకులను ఆశ్రయించారు. అయితే కేవలం రూ.82.72 కోట్లు మాత్రమే ఇప్పటి వరకు మంజూరు చేశారు. ఇంకా రూ.107 కోట్ల వరకు లోన్ మంజూరు కావాల్సి ఉంది. జగ్గయ్యపేటలోని గృహాల నిర్మాణాల నిమిత్తం రూ.56 కోట్లు అవసరం. దీని కోసం బ్యాంకులను ఆశ్రయిస్తే కేవలం రూ.9.8 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకున్నారు. ఇంకా రూ.46.25 కోట్ల వరకు మంజూరు చేయాల్సి ఉంది. నందిగామ పరిధిలోని ఇళ్ల నిర్మాణల కోసం అవసరమైన రూ.3.26 కోట్లు కావాలని బ్యాంకర్లను కోరితే రూ.1.17 కోట్లు మాత్రమే మంజూరు చేశారు. దాదాపు రూ.2.1 కోట్లు విడుదల కావాల్సి ఉంది. తిరువూరులో కూడా ఇదే దుస్థితి నెలకొంది. రూ.1329 కోట్లు అవసరమని బ్యాంకర్లను కోరితే రూ.3.51 కోట్లు మాత్రమే విడుదల చేసి చేతులెత్తేశారు. సుమారు రూ.9.79 కోట్లు మంజూరు చేయాల్సి ఉంది.

కొరవడిన చిత్త శుద్ధి

టిడ్కో గృహాల పట్ల ప్రభుత్వానికి చిత్త శుద్ధి కొరవడింది. నిర్మాణాలకు (మిగతా 6లో)



గుడివాడలో ఘోర రోడ్డు ప్రమాదం

బస్సు ఢీకొని ముగ్గురు యువకులు మృతి

ప్రజాశక్తి-గుడివాడ

కృష్ణాజిల్లా గుడివాడలో ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. బస్టాండు సమీపంలో బైక్‌ను ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో ముగ్గురు యువకులు మృతిచెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గుడివాడ బస్టాండ్ సెంటర్లో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులను ఆర్‌టిసి బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న సోహెల్ (24), సాయి (23), హర్ష (23) అక్కడికక్కడే మృతిచెందారు. ముబారక్ సెంటర్ కాకర్ల వీధికి చెందిన యువకులుగా పోలీసులు గుర్తించారు. మృతదేహాలను గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న గుడివాడ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావులు స్థానిక ఏరియా ఆసుపత్రిలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.50 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మా సమస్యలు పరిష్కరించండి

మోకాళ్లపై నిలబడి మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

ప్రజాశక్తి-విజయవాడ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ ధర్నా చౌక్‌లో కార్మికులు ధర్నా నిర్వహించారు. మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. జగనన్న గోరుముద్దకు మెను ఛార్జీలు పెంచాలని, వర్కర్లకు, హెల్పర్లకు వేతనాలు పెంచాలని నినదించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ సుప్రజ, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఎం జగన్ అధికారంలోకి రాకముందు పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారంగా పది వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఐదో తేదీలోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలని, రేషనలైజేషన్ పేరుతో స్కూల్స్ విలీనం చేయడం వల్ల ఉపాధి కోల్పోతున్న వర్కర్లకు ఉపాధి భద్రత కల్పించాలని, ధరల పెరుగుదలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులివ్వాలని, పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించొద్దని, రాజకీయ వేధింపులు ఆపాలని, రిటైర్‌మెంట్ బెనిఫింట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఏసోబు, సుశీల తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ డిల్లీరావు, జిల్లా విద్యాశాఖాధికారికి వినతిపత్రాలు అందజేశారు.

బుసక తరలింపులో వివాదం 7లో

కృష్ణాజిల్లా డిఆర్‌ఒగా చంద్రశేఖరరావు బాధ్యతలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కృష్ణాజిల్లా రెవెన్యూ అధికారిగా కె.చంద్రశేఖరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జరిగిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారిగా పని చేస్తున్న కె.చంద్రశేఖర్‌రావు కృష్ణాజిల్లాకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు కృష్ణాజిల్లా రెవెన్యూ అధికారిగా పని చేసిన పి.రోజా గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. కృష్ణాజిల్లాకు నూతనంగా వచ్చిన చంద్రశేఖర్‌రావు తొలుత జిల్లా కలెక్టర్ పి.రాజాబాబును మర్యాద పూర్వకంగా కలిసి అనంతరం బాధ్యతలు చేపట్టారు.

సాంప్రదాయ, ఆధునిక వైద్యాన్ని సమన్వయం చేయాలి

- కేంద్ర మంత్రి డాక్టర్ మన్సుక్ మాండవియా
- మచిలీపట్నంలో నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన

శంకుస్థాపన సందర్భంగా జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవడానికి సాంప్రదాయ, ఆధునిక వైద్యాన్ని సమన్వయం చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా పేర్కొన్నారు. మచిలీపట్నంలో 3.5 ఎకరాల్లో యా.10 కోట్లతో నిర్మించనున్న నర్సింగ్ కళాశాలకు ఢిల్లీలోని జాతీయ దంత కమిషన్ భవనం నుండి సోమవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ సౌలభ్యం, సరసమైన ధరలకు వైద్య సేవలు, ప్రతిఒక్కరికి ఆ ఫలాలు అందుకునే స్తోమత ప్రభుత్వ అంశాలలో ప్రధానమైనదన్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మించడానికి ముఖ్య కారణమైందన్నారు. వైద్యశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ద్వారా నోటిఫై చేసిన ఆసుపత్రులలో 25 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్యం పొందుతున్నారన్నారు. అలాగే ఆయుష్మాన్ భారత్ ద్వారా కేంద్ర ప్రభుత్వం 5 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ గ్రామాల్లో ఆశా వర్కర్లు కమ్యూనిటీ ఆరోగ్య కార్యకర్తలు ఉంటూ వైద్య సేవలందిస్తున్నారని తెలిపారు. ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి రోగి ఆరోగ్య వివరాలు నెట్వర్క్‌లో నమోదై ఎప్పటికప్పుడు (మిగతా 6లో)

టేబుల్ బహూకరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: సీతారాంపురం పాఠశాల ఉపాధ్యాయురాలు మిట్టపల్లి సత్యవతి ఎంఇఒ ఎల్.చిట్టిబాబుకి ఆఫీస్ టేబుల్‌ను బహూకరించారు. సత్యవతి భర్త చెడే వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఈ టేబుల్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శివరాం నాయక్, యుటిఎఫ్ మండల అధ్యక్షులు జి.పల్లవి, జిల్లా సహధ్యక్షులు ఎం.కష్ణయ్య, ఉపాధ్యాయులు జె.సుదానంద్, ఏ.నరసింహారావు మరియు రాఘవమ్మ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌కు బియ్యం వితరణ

జగ్గయ్యపేట: పట్టణంలో టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి శ్రీరాం రాజగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్‌కు విజయవాడ వాస్తవ్యులు మాచిన సత్యనారాయణ పేరున వారి కుమారుడు మాచిన వికాస్ 25 కేజీల 13 రైస్ బ్యాగులను రాజగోపాల్ చేతుల మీదగా అందించారు. ఈ కార్యక్రమంలో మైనేని రాధాకృష్ణ, కేళి నాగేశ్వరరావు, కాటగాని స్వామి, కుంచపర్తి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలకు కులగణన విడిగా చేయాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : రాష్ట్రంలో జరుగుతున్న కులగణాల లెక్కింపులో వడ్డెరలను వడ్డే బోవిలు, వడ్డే రాజులు, వడ్డారులు, వడ్డీలు, వడ్డెర్లగా విడివిడిగా లెక్కించడం జరుగుతుందని తమ దృష్టికి వచ్చిందన్నారు. 2016లో విడుదలైన జీవో ఎంఎస్ నెంబర్ 36 ప్రకారం పైన పేర్కొనబడిన కులాలన్నీ వడ్డెర కులస్తులుగాను అవన్నీ కూడా వడ్డెర కులాల పర్యాయపదాలని క్లియర్‌గా తెలిపారు. కులగణన చేపట్టిన రాష్ట్రంలో ఉన్న అధికారులు, వాలంటీర్లు అందరూ కూడా పైన పేర్కొనబడిన వివరాలన్నిటిని కలిపి వడ్డెర కులస్తులుగా లెక్కించాలని కోరుతూ సోమవారం చిల్లకల్లు మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి రాజుకు రాష్ట్ర వడ్డెర జెఎసి ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపిపి తాళ్లూరు వెంకటేశ్వర్లు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారుపాటి డేవిడ్, చల్లా సాంబశివరావు, బత్తుల గిరి, గుంజు హరిబాబు, ఉప్పుతోళ్ల నాగయ్య, వడ్డెర యువత పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని ముక్త్యేశ్వరపురం గ్రామంలో గల శ్రీ భవానీ ముక్త్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో సోమవారం దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారిగా షేర్ మహ్మద్ పేట గ్రూప్ టెంపుల్స్ ఇఒ వైష్ణవి వంశపారం పర్య ధర్మకర్త వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్తు తరుపున ప్రతినిధి పి.రాంప్రసాద్, సేవాదళ్ వారి సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించారు. స్వామివారి హుండీల ఆదాయం లెక్కించగా రూ.2,17,912/-లు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి సిహెచ్.జయప్రకాష్‌బాబు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన వేలంపాటలు 1.లడ్డు అమ్ముకోను హక్కు లైసెన్సుకు రూ.1.45లక్షలు 2.కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే లైసెన్స్‌కు రూ.41,500/-లు ఆదాయం చేకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి సిహెచ్.జయప్రకాష్ బాబు తెలిపారు.

ఎల్‌బిఆర్‌సిఇకి సిస్కో బెస్ట్ వర్కింగ్ అవార్డు

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు సిస్కో నెట్ వర్కింగ్‌లో ఉత్తమ అకాడమీ అవార్డు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1న బెంగుళూరులో సిస్కో నెట్ వర్కింగ్ అకాడమీ వార్షికోత్సవ వేడుకలలో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ అవార్డుకు కృషి చేసిన ఉపాధ్యాయులు డా.కె.ఫణీంద్ర, ఎన్.శ్రీకాంత్, డాక్టర్ పి.లచ్చిరెడ్డిలను కళాశాల యాజమాన్యం, ప్రెసిడెంట్ జి.శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు, డీన్స్ సి.ఎస్.ఈ విభాగాధిపతి డా.డి.వీరయ్య, ఐ.టి విభాగాధిపతి డా.బి.శ్రీనివాస రావు, సి.ఎస్.ఇ (ఎఐ,ఎంఎల్) విభాగాధిపతులు డా.ఎస్.జయప్రద, డా.ఓ.రమాదేవి, కాలేజీ స్పోక్ డా.ఎస్.నాగాంజనేయులు అభినందనలు తెలిపారు.

సిస్కో అవార్డు రావడానికి కృషి చేసిన ఉపాధ్యాయులు అభినందిస్తున్న ఎల్‌బిఆర్‌సి యాజమాన్యం

పదో తరగతి మోడల్ టెస్ట్‌కు విశేష స్పందన

అధిక సంఖ్యలో హాజరైన విద్యార్థులు

జగ్గయ్యపేటలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని జెఆర్‌సి జూనియర్ కళాశాలలో పదో తరగతి మోడల్ పరీక్ష పేపర్‌ను జెఆర్‌సి విద్యాసంస్థలు చైర్మన్, డైరెక్టర్ ఆర్.మణికంఠ, సెక్రటరీ, కరెస్పాండెంట్ పెనుగొండ వెంకట్రావు, యు.టి.ఎఫ్ జిల్లా నాయకులు ఎం.కృష్ణయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సోమేశ్వరరావు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సోమేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు కమల్‌కుమార్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పర్యవేక్షణలో జరుగుతున్న ప్రజ్ఞ వికాసం పదో తరగతి మోడల్ పరీక్ష జగ్గయ్యపేట మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల నుంచి పదో తరగతి విద్యార్థులు 700 మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్ష రాశారన్నారు. కె.ఎస్.లక్ష్మణరావు పర్యవేక్షణలో జరుగుతున్న ఈ పరీక్షకు విద్యార్థుల వద్ద నుంచి విశేష ఆదరణ లభించిందని, భవిష్యత్తులో రాయబోయే అనేక పోటీ పరీక్షలకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజ్ఞ వికాసం పరీక్ష దోహదపడుతుందని, విద్యార్థులు చాలా సంతోషం వ్యక్తం చేశారని వారన్నారు. విద్యార్థుల్లో ఉన్న సజనాత్మకతను వెలికి తీసేందుకు టాలెంట్ టెస్ట్‌లు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విశ్వ భారతి డిగ్రీ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. **మైలవరం :** ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పర్యవేక్షణలో జరుగుతున్న ప్రజ్ఞ వికాసం పరీక్షకు సోమవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల నుండి విశేష స్పందన లభించింది. మొత్తం 500 మందికిపైగా విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎం.చరణ్, మండల ఉపాధ్యక్షులు పి.సాయికుమార్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడల్ ప్రజ్ఞా వికాసం పరీక్ష విద్యార్థి విద్యార్థులకు భవిష్యత్తులో ఎన్నో పరీక్షలకు దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జి.దీపిక, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు సిహెచ్ సుధాకర్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ముల్లంగి స్పందన, శీలం కృష్ణ వేణి, విజయ్, చందు తది తరులు పాల్గొ న్నారు. **విసన్నపేట :** ప్రజ్ఞా వికాస్ పరీక్ష మండల కేంద్రమైన జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్ఎం ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఇసిహెచ్ ఇ.సూర్య నారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి విస్సంపల్లి నాగరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు వి.కార్తీక్ కార్తీక్ పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరు పట్టణంలో ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో తిరువూరు పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సోమవారం ప్రజ్ఞా వికాసం టాలెంట్ టెస్ట్ జరిగింది. ముందుగా పరీక్షా పత్రాలను ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల పట్ల విద్యార్థుల్లో భయం పోగొట్టేందుకు ప్రజ్ఞా వికాసం టాలెంట్ టెస్ట్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలల్లో, సిద్ధార్థ, నాగార్జున, శ్రీనిధి, విజ్ఞాన్, వివేకానంద, భాష్యం విద్యాలయాల్లో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు మొత్తం 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్ఐ నాయకులు మోహన్ కృష్ణ, ప్రసాదు, సిఐటి మండల కార్యదర్శి బి.వెంకటేశ్వరావు, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

విస్సన్నపేట, తిరువూరులో పరీక్షా పత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

మైలవరంలో పరీక్ష రాస్తున్న దృశ్యం

భార్యను హత్య చేసిన భర్త

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : కుటుంబ తగాదాల నేపథ్యంలో ఒక వ్యక్తి భార్యను కిరాతకంగా చంపిన సంఘటన వత్సవాయి మండలం భీమవరం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పెనుగంచిప్రోలు తుఫాన్ కాలనీకి చెందిన పద్మాల సురేష్, త్రివేణి భార్యభర్తలు. వీరికి పది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. సురేష్ భవన నిర్మాణ పనులకు కూలిపని చేస్తూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా కుటుంబ కలహాలు చోటు చేసుకోవడంతో భార్యాభర్తలిద్దరూ గొడవలు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే శనివారం ఉదయం గుడికి వెళ్లి వస్తామని కుమారుడు, కుమార్తెతో చెప్పి దంపతులిద్దరూ ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లారు. రాత్రి అయినా రాకపోవటంతో పిల్లలు ఇద్దరు ఆందోళన చెందుతూ స్థానికంగా ఉన్న తాతయ్యకు చెప్పారు. బంధువులకు ఫోన్ చేసి అడుగగా రాలేదని చెప్పారు. దీంతో ఆదివారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు దర్యాప్తు చేపట్టారు. అనుమానంతో సోమ వారం తెల్లవారుజామున సురేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా వత్సవాయి మండలంలోని కొంగర మల్లయ్య గట్టు వద్ద మల్లికార్జున స్వామి కొండపై నుంచి కిందకు తోసి హత్య చేసినట్లు తెలిపాడు. అతని సమాచారం మేరకు కొండపైకి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కనుగొన్నారు. వివరాలు తెలియాల్సి ఉందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని జగ్గయ్యపేట సిఐ జానకిరామ్ స్థానిక ఎస్ఐ పి.రాంబాబు తెలిపారు.

సురేష్, త్రివేణి

ప్యాసింజర్ రైలు కోసం వినతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ఎంతోకాలంగా జగ్గయ్యపేట పట్టణ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న ప్యాసింజర్ రైలు చిరకాల వాంఛ ప్రభుత్వవిప్, శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను కృషితో త్వరలో తీరబోతుందని యువ నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎంపి కేశినేని నాని, అయోధ్య రామిరెడ్డి, మల్లాది విష్ణులతో కలిసి ఢిల్లీలో రైల్వే బోర్డు సిఇఒ అండ్ చైర్మన్ జయవర్మ సిన్హా కలసి ఈ బడ్జెట్ సమావేశాల్లో మోటమర్రి, జగ్గయ్యపేట, మేళ్లచెరువు తదితర స్టేషన్స్, ప్లాట్ ఫామ్ నిర్మించడానికి టెండర్లు పిలిచి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని వినతిపత్రం అందజేశారు.

పెండ్యాలలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామంలో సోమవారం 'గడపగడపకు – మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యా, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు గ్రామాల అభివద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి షేక్ మలక్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన తహాశీల్దార్ల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట నూతన తహాశీల్దార్‌గా ఎం.సుజాత సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె తూర్పు గోదావరి జిల్లా కడియం నుండి విస్సన్నపేటకు బదిలీపై వచ్చినట్లు తెలిపారు.

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండల తహాశీల్దార్‌గా వి.సుస్వాగతం సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రాజమండ్రి అర్బన్ తహాశీల్దార్‌గా పనిచేస్తున్న సుస్వాగతంను ఎన్నికల బదిలీలలో భాగంగా కంచిక చర్లకు బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ తహాశీల్దారుగా పనిచేసిన పి.శంకర్‌బాబు విజయవాడ నార్త్ తహాశీల్దారుగా బదిలీ అయ్యారు. ఆయనను డిప్యూటీ తహాశీల్దార్ నాగుల్ మీరా, కార్యాలయ సిబ్బంది, ఆర్ఐలు, విఆర్ ఒలు మొక్కను బహూకరించి, శాలు వాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం నూతన తహాశీల్దార్‌గా టిఆర్.రాజేశ్వరరావు సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి మైలవరం బదిలీ అయ్యారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వత్సవాయి : గోపీనేనిపాలెంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం గోపినేనిపాలెంలో నిర్వహిస్తున్నట్లు కొమరగిరి ట్రస్ట్, తిరుమలగిరి దేవస్థానం చైర్మన్ కొమరగిరి భరద్వాజ్, పిన్నమనేని హాస్పిటల్ పిఆర్ఒ ఆరవల్లి రాఘవ తెలిపారు. చిన్నఅవుటుపల్లి పిన్నమనేని సిద్దార్థ్ కంటి ఆసుపత్రి, కొమరగిరి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటలు వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉచిత కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచిత బస్సు ఏర్పాటు చేసి ఆపరేషన్లు చేయించనున్నట్లు వివరించారు. కంటి వైద్య పరీక్షలకు వచ్చే వారు ఆధార్ కార్డుతో హాజరవ్వాలని సూచించారు.

పలు అంశాలపై చర్చ

ప్రజాశక్తి - చందర్లపాడు : తుర్లపాడు గ్రామంలో చందర్లపాడు మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ములుగు వీరాచారి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎన్టీఆర్ జిల్లా మండలాలు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసి పలు అంశాలపై చర్చించారు. ఇటీవల కాలంలో చందర్లపాడు మండలంలో నిర్వహించిన పలు కార్యక్రమాలపై ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు స్పందిస్తూ మండల విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, అధ్యక్షులు చక్కగా సంఘానికి సహకరించిన వారిని ప్రశంసించారు.

9న నులిపురుగుల నిర్మూలన మాత్రలు పంపిణీ : డిఆర్‌ఒ

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థికి నులిపురుగుల నిర్మూలన మాత్రలు అదేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్ర శేఖర్ సూచించారు. ఈ నెల 9వ తేదీన అల్బెండజోల్ మాత్రల పంపిణీ సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలు, కరపత్రాలను జిల్లా రెవెన్యూ అధికారి వివిధ శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డి ఆర్ ఓ మాట్లాడుతూ నులిపురుగులు ఉన్న పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపం ఏర్పడుతుందని ఎక్కువగా అలసిపోతారని, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు వంటివాటితో పాటు బరువు తగ్గుతారాన్నారు. వివిధ శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. కాబట్టి అల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా ఈ సమస్యలను నివారించవచ్చు అన్నారు. ఈ నెల 9వ తేదీన 1-19 ఏళ్ల వయసు వారందరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ జరుగుతుందని. కాబట్టి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి, తమ పిల్లలు మాత్రలు తీసుకునేలా చూడాలన్నారు. 1-2 సంవత్సరాల చిన్నారులకు సగం మాత్ర (200 మి.గ్రా.), ఆపైన 19 ఏళ్ల వయసు వరకు ఒక మాత్ర (400 మి.గ్రా.) తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 9న మాత్రలు తీసుకోకుండా మిగిలి పోయిన వారికి ఫిబ్రవరి 16వ తేదీన మాత్రలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడా వి సి, ఎం.వెంకటేశ్వర్లు,ఆర్ డి ఓ, ఎం.వాణి,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతబాయి ,జిల్లా విద్యాశాఖ అధికారి, తాహెరా సుల్తానా, ఐసిడిఎస్ పిడి ఎస్.సువర్ణ,తదితరులు ఉన్నారు.

ఆసరా చెక్కు అందజేత

ప్రజాశక్తి - గుడివాడ : నందివాడ మండలంలో నాలుగో విడత ఆసరాకు సంబధించిన రూ.6 కోట్ల78లక్షల 57వేల 968 రూపాయల జంబో చెక్కును మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అందజేశారు. సోమవారం నందివాడ మండలంలో నిర్వహించిన నాలుగవ విడత ఆసరా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొడాలి నానితో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని 790 గ్రూపులలోని 7,853 మంది మహిళలకు నాలుగో విడత ఆసరా జంబో చెక్కును లబ్ధిదారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి కొడాలి నాని ఆవిష్కరించారు. వైసిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశి భూషణ్, ఎంపిపి పెయ్యల ఆదాం, జడ్పిటిసి కందుల దుర్గాకుమారి, సర్పంచ్ రత్నకుమారి, వైస్ ఎంపిపి పూడి సుధాకర్, గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ మట్టా నాగమణి పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారమే 'స్పందన' లక్ష్యం : ఎస్‌పి

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : స్పందన అర్జిల సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి పోలీసు అధికారులను ఆదేసించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు తమకు ఎటువంటి సమస్యలున్నా నిర్భయంగా తనకు నేరుగా ఫిర్యాదు అందజేయగలరని, సమస్య ఏదైనా చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన న్యాయం చేకురేలా చర్యలు తీసుకోవడం తీసుకుంటామని ఫిర్యాదుదారులకు

భరోసా కల్పించారు. మొత్తం 40 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ కార్యాలయం తెలిపింది.

కళాకారులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

ప్రజాశక్తి-గుడివాడ : పట్టణ కళాకారుల సంఘం సేవా రంగంలో మరింత ముందుండి సేవా కార్యక్రమలు నిర్వహించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఎన్‌జీవో హూమ్‌లో పట్టణ కళాకారులు సంఘం 3వ వార్షికోత్సవం సందర్భంగా జన్మదినోత్సవం జరుపుకుం టున్న సందర్భంగా కాళాకారుల సంఘం గౌవర అధ్యక్షుడు నెరుసు చింతయ్యను మాజీ మున్సిపల్ చైర్మన్ యలలవర్తి శ్రీనివాసరావు, అర్బన్‌బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ) డాక్టర్ బండారు శ్యామ్, మాజీ ప్రిన్సిపల్ అంజనేయులు, మాజీ కౌన్సిలర్ గోకరకొండ బలరామ్, చిన్న, నెరుసు శేషగిరిరావు, సంఘ ఉపాధ్యక్షులు, పాము స్వామిదాస్ శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

ఈ సందర్భంగా యలవర్తి, పిన్నమనేనిలు మాట్లాడుతూ 20మంది వృద్ధకాళాకారులను ప్రతి నెలకు రూ1000పాయిలను గత 25నెలలుగా అందిస్తున్న చింతయ్య అభినందనీయుడన్నారు.

తహశీల్దార్లు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు విజయవంతం చేస్తానని, మండల ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తానని చల్లపల్లి మండల నూతన తహసీల్దార్ బీ.సుమతి అన్నారు. సోమవారం చల్లపల్లి మండల రెవిన్యూ కార్యాలయంలో నూతన తహసీల్దార్ సుమతి తన బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఏలూరు జిల్లా పోలవరం నుంచి బదిలీపై వచ్చిన ఆమె చల్లపల్లి తహసీల్దారుగా నియమితులయ్యారు. ఆమెకు డిప్యూటీ తహసీల్దార్ కుమార్, ఇంచార్జి ఆర్ఐ ఘంటసాల కష్ణమోహన్, వీఆర్వోలు స్వాగతం పలికి సత్కరించారు. **ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** మచిలీపట్నం మండలంకు ఇద్దరు తహశీల్దార్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ప్రభుత్వం మచిలీపట్నం మండలంను నార్త్, సౌత్ మండలాలుగా విభజించారు. సాదారణ బదిలీల్లో భాగంగా సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమల నుండి మచిలీపట్నం నార్త్ మండల తాసిల్దార్ గా పి సతీష్, గణపవరం నుండి మచిలీపట్నం సౌత్ మండలం తాసిల్దార్ గా పి లక్ష్మీ లు భాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు తహసీల్దార్ గా పనిచేసిన శ్రీ విద్య మోపిదేవి మండలానికి బదిలీ అయ్యారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ నూతన తాసిల్దార్ గా ఎం సునీల్ కుమార్ సోమవారం విధుల్లో చేరారు. ఆయనకు కార్యాలయం సూపర్డెంట్ మండలి కేశవి పూలగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. ఇక్కడ ఇప్పటివరకు పని చేసిన ఎల్ వి ఎస్ రామకష్ణ నరసాపురం కె ఆర్ ఆర్ సి తాసిల్దారుగా బదిలీపై వెళ్ళగా ఉండి తాసిల్దారుగా పనిచేస్తున్న సునీల్ కుమార్ అవనిగడ్డ కు వచ్చారు. **ప్రజాశక్తి-పెదపారుపూడి :** పెదపారుపూడి మండల తాసిల్దారిగా మాధవరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి మండల తాసిల్దారుగా చేస్తూ బదిలీపై పెదపారుపూడి వచ్చారు. గుడివాడ రెవిన్యూ డివిజన్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు చాట్ల అజయ్‌కుమార్ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి టీ వాణి, ఆర్ ఐ రవికుమార్, వీఆర్వోలు భగవంతు రావు, ఆనంద్ భూపతి రావు, ప్రసాద్, అమర, శ్రీనివాస్ ,దానియేలు ,వెంకట్, వీఆర్ఏ చుక్కమ్మ ,నాగేశ్వరరావు ,తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి గూడూరు :** గూడూరు మండల తహసిల్దార్ గా ఎస్ ఎస్ శాంతి సోమవారం భాధ్యతలు స్వీకరించారు.సాదారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు తహసిల్దార్ గా విధులు నిర్వహించిన విజయ ప్రసాద్ కాకినాడకు బదిలీ అయ్యారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని,ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చూస్తానని నూతనంగా నియమితులైన శాంతి ఈ సందర్భంగా తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ వై శివశంకర్,కార్యాలయ సిబ్బంది,వి ఆర్ ఓ లు అభినందనలు తెలిపారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడు మండల తహసీల్దార్ గా యమ్. రామకష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రామకష్ణ గతంలో తూర్పు గోదావరి జిల్లా, దేవరపల్లి మండలం తహశీల్దార్‌గా పనిచేశారు. ఎన్నికల బదిలీల్లో బాగంగా కంకిపాడు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరంఉప్పలూరు గ్రామంలోని పోలింగ్ బూత్ లను పరిశీలించారు. ఉప్పలూరు గ్రామ సచివాలయంలో పేదలందరికీ ఇళ్ళ నివేశన స్థలాల రిజిస్ట్రేషన్ పక్రియను పరిశీలించారు. **ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం నూతన తహసిల్దార్ గా ఎం సీతా పవన్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో వీరు తూర్పుగోదావరి జిల్లా రాజానగరం తహసిల్దార్ గా పనిచేశారు. సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా గన్నవరానికి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టి తహసిల్దార్ కు సిబ్బంది సాదర స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. **ప్రజాశక్తి -మొవ్వ (అవనిగడ్డ) :** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న అధికారుల బదిలీల్లో భాగంగా ఇప్పటివరకు మొవ్వ తాసిల్దార్ గా విధులు నిర్వహించిన సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ అమలాపురం బదిలీ కావడంతో ఆయన స్థానంలో కాకినాడ నుంచి బదిలీపై వచ్చిన సిహెచ్ వెంకటలక్ష్మి మొవ్వ తహసీల్దారుగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డీటీ గోపాలరావు, ఆర్ఐ విజయలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ శామ్యూల్, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు అభినందనలు తెలిపారు.

గన్నవరం తహశీల్దార్ పవన్‌కుమార్



కంకిపాడు తహసీల్దార్ రామకష్ణ

పెదపారుపూడిలో తహసీల్దార్‌కు అభినందనలు

బాలికపై అత్యాచారం

- ఫోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని యాకమూరు గ్రామంలో బాలికపై అత్యాచారం జరిగిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై విశ్వనాధ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బోలెం దిలీప్‌కు బాలికకు గతంలో ఇంస్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి బాలికను మాట్లాడదాం బయటికి రమ్మని దిలీప్ పిలిచాడు. ఇంటి వసారా ఆవరణలో మాట్లాడుతూ ఉండగా బాలికను దిలీప్ తో పాటు మరో బాలుడు(17) తమ బైక్ మీద ఎక్కించుకుని ఏకమురు శివారు ప్రాంతంలోనికి తీసుకెళ్లి అత్యాచారంకి ఒడిగట్టారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు డిఎస్‌పి శ్రీకాంత్, సిఐ కిషోర్‌బాబు, ఎస్సై విశ్వనాధులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై ఫోక్సో, అత్యాచార, ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశామని ఎస్సై విశ్వనాథ తెలిపారు.

కోడూరు ఎస్‌ఐగా శిరీష

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు ఎస్సైగా పి.శిరీష బాధ్యతలను చేపట్టారు. సోమవారం ఆమె స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సైగా బాధ్యతలను తీసుకున్నారు. నందివాడ ఎస్సైగా పనిచేస్తూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆమెను కోడూరు ఎస్సైగా బదిలీ చేశారు. సోమవారం పోలీస్ స్టేషన్ వద్ద స్థానిక పోలీస్ సిబ్బంది ఆమెకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఎస్సైగా బాధ్యతలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఆంజనేయుల తో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మాట్లాడుతున్న బుద్ధప్రసాద్

ఘంటసాలలో 'జయహో బిసి'

ప్రజాశక్తి ఘంటసాల : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీ వర్గాలకు రక్షణ కవచంలా నిలిచింది తెలుగుదేశం పార్టీనేనని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఘంటసాలలోని విశ్వేశ్వరస్వామి కళ్యాణ మండపంలో సోమవారం జయహెూ బీసీ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు కల్పించి అల్పసంఖ్యాక వర్గాలైన బీసీ, ఎస్సీ,ఎస్టీ వర్గాలకు రాజ్యాధికారాన్ని కల్పించారన్నారు. ఆనాటి నుంచి ఆయా వర్గాల్లో ఎంతో మంది రాజకీయంగా స్థిరపడ్డారన్నారు. రాష్ట్ర బీసీ సంఘ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, టీడీపీ నేతలు తుమ్మల చౌదరిబాబు, పరిసె చలపతి, తాడికొండ వేంకటేశ్వరరావు (చిన్న), దిరిశం వెంకట్రావు పాల్గొన్నారు.

రక్తగ్రూపుల నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి-గన్నవరం : బాలలు అందరూ సేవాభావం చిన్న వయస్సు నుండే అలవర్చుకోవాలని, మంచి నడత కలిగి ఉండాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కష్ణా జిల్లా సెక్రెటరీ భవిరి శంకర్ నాథ్ చెప్పారు. సోమవారం స్థానిక జిల్లా పరిషద్ బాలికల హై స్కూల్ లో జరిగిన రక్తగ్రూపుల నిర్ధారణ శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గన్నవరం మండల ఎంఈఓ కే. రవి కుమార్ పాల్గొని పిల్లలకు రెడ్ క్రాస్ విశిష్టత ను తెలియచేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. ఝాన్సి రాణి, స్థానిక రెడ్ క్రాస్ చైర్ పర్సన్ సి. మాధవి పాల్గొన్నారు.

దుర్గమ్మకు మూడు బంగారు నాణేలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానానికి స్టైస్ పార్క్, వైజాగ్‌కు చెందిన శ్రీకాంత్ వర్మ సాగి, కుటుంబ సభ్యులు శ్రీ అమ్మవారి అలంకారం నిమిత్తం మొత్తం 25 గ్రాముల బరువు గల మూడు బంగారు కాయిన్లను సోమవారం ఆలయ అధికారులను కలిసి దేవస్థానానికి విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు దాత కుటుంబానికి శ్రీ అమ్మవారి దర్శనం కల్పించగా, వేదపండితులు దాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మ దేవస్థానం తరపున మావుళ్ళమ్మ అమ్మవారికి సారె సమర్పణ

విజయవాడ దుర్గగుడి ఆధ్వర్యంలో దుర్గమ్మ దేవస్థానం తరపున శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారికి సారె సమర్పించారు. దుర్గగుడి కార్యనిర్వహణాధికారి కెఎస్.రామారావు ఆదేశాల మేరకు భీమవరంలోని శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో 60 సంవత్సరాల ఉత్సవాలు సందర్భంగా దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం తరపున మావుళ్ళమ్మ అమ్మవారికి దుర్గగుడి ఛైర్మన్ కర్నాటి రాంబాబు, పాలకవర్గ సభ్యులు సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైదిక సిబ్బంది ఉండి శ్రీనివాస్ శాస్త్రి, కుందుర్తి శేఖర్ శర్మ, దేవస్థానం ప్రత్యేక అహ్వానితులు వెంకట రాజు, ఫెస్టివల్ సెక్షన్ నుండి కె.శ్రీనివాస్ రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ వాహనం వద్ద లబ్ధిదారులతో మాట్లాడుతున్న బోయి సత్యబాబు

రేషన్ సరుకులు నాణ్యంగా అందించాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రేషన్ సరుకులను నాణ్యమైనవి రేషన్ డిపోల ద్వారా తెల్ల రేషన్ కార్డు దారులకు కందిపప్పు, మరిన్ని నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని సిపిఎం ఫ్లోర్ లీడర్, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన రేషన్ పంపిణీ కేంద్రాల వద్ద రేషన్ నాణ్యత వివరాలు, ఇబ్బందులను తెలుసుకున్నారు. రేషన్ బియ్యం నాణ్యమైనవి సరఫరా కావడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. కందిపప్పు 750 కార్డులకు 200 కార్డులకు మాత్రమే పౌరసరఫరాల శాఖ అందచేయటం సరికాదన్నారు. ఇస్తున్న కందిపప్పు సక్రమంగా ఉడకడం లేదన్నారు. నివాసాలు మారుతున్న కార్డుదారులకు ఆయా ప్రాంతాల్లో ఉన్న రేషన్ వాహనం ద్వారా రేషన్ ఇప్పించే విధంగా అధికారులు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రేషన్ కార్డులపై పలు నిత్యావసర సరుకులివ్వాలని కోరారు. రేషన్ కార్డుల్లో చేర్పులు, తొలగింపులు ప్రక్రియలు సక్రమంగా జరగక ఇబ్బందులు పడుతున్నామని కొందరు స్థానికులు తన వద్ద వాపోతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక భవానీపురంలోని పాత పోలీస్ స్టేషన్ సమీపంలో టిడిపి సీనియర్ నాయకులు శివాజీ ముదిరాజ్ (క్రేన్ శివాజీ), ముదిగొండ శివ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టిడిపి 42వ డివిజన్ పార్టీ కార్యాలయం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కేశినేని శివనాథ్ (చిన్ని), మాజీ ఎమ్మెల్సీ బుద్ద వెంకన్న, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కె.నాగుల్ మీరా, జనసేన పశ్చిమ నాయకులు బాడిత శంకర్ తదితరులు పాల్గొని కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ ఎన్టీ రామారావు విగ్రహానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యాలయం ప్రారంభోత్సవ సభలో కేశినేని చిన్ని, మాజీ ఎమ్మెల్సీ బుద్ద వెంకన్న మాట్లాడుతూ చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేంతవరకు విశ్రమించేది లేదని అన్నారు. టిడిపి నాయకులు నాగుల్ మీరా, టిడిపి నాయకులు శివాజీ ముదిరాజ్ మాట్లాడారు. మాజీ కార్పొరేటర్ పత్తి నాగేశ్వరరావు, స్థానిక నాయకులు పెద్ది సతీష్, పెద్ది శ్రీను, పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

టిడిపి కార్యాలయం ప్రారంభిస్తున్న కేశినేని శివనాథ్, బుద్ధా, నాగుల్‌మీరా

9న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం

కలెక్టర్ ఎస్.డిల్లీరావు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9న అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలు, కరపత్రాలను కలెక్టర్ డిల్లీరావు జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ నులి పురుగులు ఉన్న పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడుతుందని ఎక్కువగా అలసిపోతారని, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు వంటివాటితో పాటు బరువు తగ్గుతుందన్నారు. వివిధ శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని వివరించారు. అల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా ఈ సమస్యల బారినపడకుండా చూడొచ్చన్నారు. ఈ నెల 9న 1-19 ఏళ్ల వయసు వారందరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ జరుగుతుందని.. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి, తమ పిల్లలు మాత్రలు తీసుకునేలా చూడాలన్నారు. 1-2 సంవత్సరాల చిన్నారులకు సగం మాత్ర (200 మి.గ్రా.), ఆపైన 19 ఏళ్ల వయసు వరకు ఒక మాత్ర (400 మి.గ్రా.) తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 9న మాత్రలు తీసుకోకుండా మిగిలి పోయిన వారికి ఫిబ్రవరి 16వ తేదీన మాత్రలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యా సంస్థల్లో గోడపత్రికల ద్వారా నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై అవగాహన కల్పించి.. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ తదితర విద్యార్థులకు నులి పురుగుల మాత్రలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వి.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, డీసీహెచ్‌ఎస్ బీసీకే నాయక్, జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారి డా.మాధవి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి జి.ఉమాదేవి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జి.వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు.

చిట్టి విగ్రహావిష్కరణ సభలో అల్లరి మూకలు : మేయర్

మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ శాసనసభ్యులు మరుపిళ్ళ చిట్టి కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో జనసేన పశ్చిమ ఇన్‌ఛార్జి పోతిన వెంకట మహేష్, ఆయనతో వచ్చిన కార్యకర్తలు దారుణంగా వ్యవహరించారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఘాటుగా విమర్శించారు. సోమవారం పశ్చిమ నియోజకవర్గంలోని మేయర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సభను ఆసాంతం జరగకుండా పోతిన మహేష్ అల్లరిమూకలతో కలిసి ఆగడాలు చేశారన్నారు. సర్దార్ చిట్టి విగ్రహావిష్కరణ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామని, అయితే అవేమీ జరగనీయకుండా మహేష్ అల్లరిచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిట్టి నగరానికి చేసిన సేవలను గుర్తించి తాను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని కలిసి చిట్టి కార్యాలయం స్థలంలో చిట్టి స్మృతివనం, గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరానని, దానిపై సిఎం అంగీకరించినట్లు తెలిపారు. అయితే ఈనెల 4వ తేదీన చిట్టి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం స్థలంలో ఎమ్మెల్యే వెలంపల్లి కమర్షియల్ కాంప్లెక్స్ కట్టడానికి చూస్తున్నారని అసత్యాలను ప్రచారం చేయడం దారుణమని మేయర్ భాగ్యలక్ష్మి విమర్శించారు. నగరాల క్షేమం కోసం పోతిన మహేష్ ఏం చేశాడని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాయన బాబూజీ (బాజ్జీ) మాట్లాడారు. ఈ సమావేశంలో పలువురు నగరాల నాయకులు పాల్గొన్నారు.

ఆరో రోజుకు నవదిన ప్రార్థనలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మరియమాతను గౌరవిస్తే దేవుని అనుగ్రహాలు లభిస్తాయని ఎంఎస్‌ఎఫ్ఎస్ ప్రావిన్షియల్ రెవరెంట్ ఫాదర్ బవిరి సురేష్ అన్నారు. గుణదల మాత 100 వసంతాల మహోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం జరిగిన 6వ రోజు నవదిన ప్రార్థనలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుణదల మాత పుణ్యక్షేత్రం కతోలిక క్రైస్తవ పుణ్యక్షేత్రమైనప్పటికీ ఇక్కడ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల మిళితమైన సంస్కృతి స్పష్టంగా కనిపిస్తుందన్నారు. గుణదలమాత పుణ్యక్షేత్రాన్ని కేవలం ఒక క్రైస్తవులే కాకుండా అన్ని కులాలు, మతాల వారు సందర్శించి అనేక మేలులు పొందుతున్నారని అన్నారు. విజయవాడ కతోలిక పీఠం మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు స్వామి మాట్లాడుతూ గుణదల మాతను దర్శిస్తున్న యాత్రికులపై మరియతల్లి దీవెనలు మెండుగా లభిస్తాయన్నారు. ఇంకా గుణదల మాత ఉత్సవాలు నాలుగు రోజులే ఉన్నాయని ఇప్పటికే ఏర్పాట్లు శరవేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. అనంతరం లూర్థుమాత స్వరూపం వద్ద గురువులు సమిష్టి దివ్య పూజాబలి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప, ఫాదర్ అనిల్, ఫాదర్ పి.విజయ్,సిస్టర్స్ యువతీ, యువకులు పాల్గొన్నారు.

సిఎంపై వసంత విమర్శలు సరికాదు

మైలవరం వైసిపి ఇన్‌ఛార్జి తిరుపతిరావు

మాట్లాడుతున్న మైలవరం వైసిపి ఇన్‌ఛార్జి తిరుపతిరావు

ప్రజాశక్తి - భవానీపురం : మైలవరం ఎమ్మెల్యేగా ఇప్పటివరకు బాధ్యతలు నిర్వర్తించిన వసంత వెంకట కృష్ణప్రసాద్ సిఎం జగనన్నపై ఆరోపణలు చేయడం తగదని మైలవరం వైసిపి ఇన్చార్జ్ తిరుపతిరావు విమర్శించారు. సోమవారం భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైసిపి కార్యాలయంలో మైలవరం ఇన్‌ఛార్జ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ ఐదేళ్లుగా వెంకటకృష్ణ ప్రసాద్ వెంట తాము పనిచేశామని తెలిపారు. కొన్ని అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ప్రభుత్వం నుంచి రాలేదనే సాకుతో ముఖ్యమంత్రిని విమర్శిస్తూ నేడు పార్టీ వీడి వేరే పార్టీలోకి వెళ్లటం సమంజసం కాదని విమర్శించారు. మైలవరం పరిశీలకుడు పడమటి సురేష్ బాబు మాట్లాడుతూ ఒక పేద వర్గానికి చెందిన జెడ్‌పిటిసి తిరుపతిరావును మైలవరం ఇన్చార్జిగా ముఖ్యమంత్రి నియమించడం అభినందనీయమని కొనియాడారు. తిరుపతిరావును గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జి కొండూరు నాయకులు జక్కి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌డిఎఫ్‌సి స్కైపట్ల వినియోగదారుల ఆసక్తి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీ ఫ్లాట్ ప్రైసింగ్ సంస్థ జనవరి నెలలో లక్ష మందికిపైగా వినియోగదారులను చేర్చుకున్నట్లు సంస్థ రీజనల్ హెడ్ కె.కుమార స్వామి తెలిపారు. నగరంలోని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీ సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. సెప్టెంబరు 2023లో ప్రారంభించిన ఫ్లాట్ ప్రైస్ బ్రోకింగ్ యాప్ ప్రస్తుతం దాని ప్లాట్‌ఫారమ్‌లో మూడు లక్షల మంది వినియోగదారులను కలిగిఉందని తెలిపారు. హెచ్‌డిఎఫ్‌సి స్కై, అనేది ఈక్విటీ, ఎం.ఎఫ్. గ్లోబల్ ఇన్వెస్టింగ్, మరిన్ని వాటిని పెట్టుబడి అవసరాలకు ఒక ప్లాట్‌ఫామ్‌గా నిలుస్తుం దన్నారు. ఇది ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు.

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉజాస్ మెన్‌స్ట్రువల్ హెల్త్ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఋతుక్రమ ఆరోగ్యంపై అవగాహన కలిగించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎస్.కె.రామారావు తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాలలో ఋతుక్రమ ఆరోగ్యంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాన్ ద్వారా ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో మహిళలకు ఋతుక్రమ సమస్యలు, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్‌లను కూడా పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - విస్సన్నపేట : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రగాయాలపాలై మృతిచెందిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. విస్సన్నపేట సెంటర్‌లో మద్దులపర్వ గ్రామానికి చెందిన చిన్ని శ్రీనివాసరావు (48) బైకును ఆపి టిఫిన్ చేస్తున్నాడు. చంద్రుపట్ల గ్రామానికి చెందిన దారావత్తు హాయ్ విస్సన్నపేట వైపు బైక్‌పై వస్తూ ఆగి ఉన్న శ్రీనివాసరావును ఢీకొనగా తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు 108 ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులున్నారు. స్థానిక ఎస్ఐ జి.రామకృష్ణ హాయ్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని మహిళలకు గాయాలు

ప్రజాశక్తి - తిరువూరు : అతివేగంగా వచ్చిన కారు కూలీలతో వెళ్తున్న ఆటోను ఢీకొట్టడంతో ఒకే ఇంటికి చెందిన ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలైన సంఘటన తిరువూరు మండలంలో సోమవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం తిరువూరు మండలం, వామకుంట్ల నుండి చింతల పాడు మిరపకాయల కోతకు 10మంది మహిళా కూలీలు ఆటోలో వెళ్తున్నారు. మార్గమధ్యలో ముష్టికుంట్ల గ్రామ శివారులో ఎదురుగా వేగంగా వస్తున్న కారు ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అత్తా జగడం సుజనకు, కోడలు రత్నకుమారికి బలమైన గాయాలయ్యాయి. 108 వాహనంలో తోటి కూలీలు వారిని తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సుజన కాలు నుజ్జు నుజ్జు అవటంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ధర్నాలో మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన సంఘం కార్యదర్శి సమ్మక్క

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ లో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి సమ్మక్క మాట్లా డుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు పాదయాత్రలో ప్రకటించిన పదివేల రూపాయలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెనూ ఛార్జీ ధరలకు అనుగుణంగా 20 రూపాయలు పెంచాలని, గ్యాస్ ప్రభుత్వ సరిపడా చేయాలన్నారు. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ,వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే ఈఎస్ఐ ,పీఎఫ్ సౌకర్యం కలిగించాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై రానున్న రోజుల్లో ఉద్యమం ఉధతం చేస్తామని ప్రకటించారు ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎం మురళి శ్రామిక మహిళా కన్వీనర్ ఈ ధనశ్రీ ,సిఐటియు జిల్లా నాయకులు కళ్ళు వెంకటేశ్వరరావు బి సుబ్రహ్మణ్యం సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ జయ రావు, పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

చౌటపల్లిలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ నియోజకవర్గ ఇంచార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో సోమవారం రూరల్ మండలం చౌటపల్లి గ్రామంలో బాబు ష్యూరిటి భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము ప్రతి ఇంటికి వెళ్ళి టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసే పథకాలు వివారించారు. జనసేన, టిడిపి కూటమి త్వరలోనే రాష్ట్రంలో మంచి పాలన అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టిడిపి రూరల్ మండలాధ్య క్షుడు వాసే మురళి, జనసేన జిల్లా నాయకులు పాలంకి సారథి, నాయకులు అట్లూరి వెంకట రమణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్గా పనిచేస్తున్న వి శశికుమార్, అదేవిధంగా వేకనూరు ఈవోగా విధులు నిర్వహిస్తూ నాగాయలంకకు బదిలీ అయిన జే హెచ్ ఎస్ పవన్ కుమార్‌కు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సురేష్‌కు ఇరువురు పిఈటి లకు మండల పరిషత్ కార్యాలయంలో సన్మానం నిర్వహించారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో అవనిగడ్డ మండల పరిషత్ కార్యాలయం ద్వారా వారు చేసిన సేవలను పలువురు ప్రజాప్రతినిధులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీడీవో ఎం మరియాదేవి, వైస్ ఎంపీపీ పులిగడ్డ పి చ్చే శ్వరరావు, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు

న్యాయవాదుల దీక్షకు టిడిపి మద్దతు

దీక్షకు మద్దతు తెలియజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు హాని చేసే వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన భూహక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేస్తాం అని గుడివాడ నియోజక వర్గ మాజీ శాసనసభ్యుడు, రావి వెంకటేశ్వరరావు తెలిపారు. వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన భూ హక్కు చాట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మచిలీపట్నం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మచిలీపట్నం జిల్లా కోర్టులో న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు చేస్తున్న నిరసన కార్యక్రమానికి రావి వెంకటేశ్వరరావు, తెలుగు రైతు అధ్యక్షుడు, గోపు సత్యనారాయణ లు సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చీకటి చట్టాలతో పాలకులు దోచుకోవాలి అనే దురుద్దేశంతో జగన్మోహన్ రెడ్డి నూతన భూహక్కు చట్టాన్ని తీసుకు రావడానికి ప్రయతించడం దుర్మార్గమన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మచిలీపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తుంగల హరిబాబు, తెలుగు రైతు అధ్యక్షుడు, గోపు సత్యనారాయణ, న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి, కొట్టే రఘురాం, న్యాయవాదులు, పుప్పాల ప్రసాద్, కునపు రెడ్డి శ్రీనివాసరావు, డి పోతురాజు, జీవీఎల్ నరసింహారావు, న్యాయవాదులు గుమాస్తాల సంఘం, అధ్యక్ష, కార్యదర్శులు, పి వి ఎస్ ఆర్ రామకష్ణ, పి. వి. ఫణి కుమార్,తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం : బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-మోపిదేవి : రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని గిట్టుబాటు ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందంటూ చేస్తున్న ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి అంటూ మాజీ ఉపసభాపతి మండల బుద్ధ ప్రసాద్ ఆరోపించారు. సోమవారం మోపిదేవి మండలంలోని పెదప్రోలు గ్రామంలో ఆయన పర్యటించి ధాన్యం అమ్మకాలలో వస్తున్న ఇబ్బందులను పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంద న్నారు. గ్రామస్థాయిలో ఏర్పాటుచేసిన ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాల ఉద్యోగుల అవగాహన రాహిత్యంతో రైతు దగా కేంద్రాలుగా తయారయ్యాయి అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులు పడుతున్న ఇబ్బందులను దష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తగిన మార్గదర్శకాలు రూపొందించి ఏ విధమైన లోటుపాట్లకు అవకాశం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొలిమెట్ల ఏసుబాబు, మాజీ పీఎసియస్ అధ్యక్షులు నాదెండ్ల శరత్ చంద్రబాబు, రైతు నాయకులు నాదెళ్ల వెంకటరామయ్య, మండవ పవన్ కుమార్ తదితరులు ఉన్నారు.

పాల కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గన్నవరం : అల్లాపురం గ్రామంలో జగనన్న పాలవెల్లువ పాలకేంద్రం ప్రారంభోత్సవం గన్నవరం మండలం ఎంపీపీ అనగాని రవి చేతుల మీదుగా సోమవారం జరిగింది. ఈ కార్యక్రములో సర్పంచ్ డొక్కు సాంబశివ, వెంకన్న బాబు, వైసిపిపార్టీ సెక్రెటరీ నాగ శంకర్, సచివాలయం కన్వీనర్ సురేష్, ఉపసర్పంచ్ అవుటుపల్లి శివప్రసాద్, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన డాక్టర్ చంద్రశేఖరరావు

- కుమారుడికి అవనిగడ్డ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు వెల్లడి

ముఖ్యమంత్రిని కలిసిన డాక్టర్ చంద్రశేఖర్, ఆయన తనయుడు రామ్ చరణ్

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ మంత్రి కీర్తిశేషులు సింహాద్రి సత్యనారాయణ రావు తనయుడు ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ చంద్రశేఖరరావు ఇన్చార్జిగా వైసిపి ఐదో లిస్టులో ప్రకటించగా ఆయనే వస్తున్నారంటూ అభిమానులంతా ఎదురుచూస్తున్న తరుణంలో తాజాగా ఆయన కుమారుడు రామ్‌చరణ్‌ను పంపారు. సోమవారం కుమారుడితో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి పార్టీలో చేరుతున్నట్లు కండవాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మీడియా సమావేశం కూడా నిర్వహించి సీఎం తనకు ఆవనిగడ్డ నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్తగా నియమించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కానీ తన వయసు రీత్యా తన కుమారుడైన సింహాద్రి రామ్ చరణ్ కు నియోజకవర్గ ఇన్చార్జి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఇక నుండి అవనిగడ్డ నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి ఇన్చార్జిగా ప్రతి గడపకు తిరిగి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదలకు అందించిన నవరత్నాలను మరింత విస్తతంగా ప్రజలకు తెలియజేస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో అవనిగడ్డ నియోజకవర్గం లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలిపే లక్ష్యంగా పనిచేస్తామని, అవనిగడ్డ ప్రజలకు మూడు తరాలుగా తమ తండ్రి సింహాద్రి సత్యనారాయణ వారసత్వాన్ని తమ కుమారుడు రామచరణ్ నిలబెట్టుకొని నియోజకవర్గ ప్రజలకు సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నాడన్నారు.

'స్పందన'కు 159 అర్జీలు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రజల నుండి అందే స్పందన అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్వో చంద్రశేఖర రావు,ముడా విసి ఎం వెంకటేశ్వర్లు, మచిలీపట్నం ఆర్డిఓ ఎం వాణి లతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగాజిల్లా యంత్రాంగం 159 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ పి ఎస్ ఆర్ ప్రసాద్, డిఎస్ఓ పార్వతి, ,డిపిఓ నాగేశ్వర నాయక్,, ఐ సి డి ఎస్ పి డి సువర్ణ, ఉద్యాన అధికారి జ్యోతి, డిఇఓ తహేరా సుల్తానా, డి సి ఓ ఫణి కుమార్, సిపిఓ గణేష్ కష్ణ, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్, సర్వే భూ రికార్డుల ఏడి వెంకటేశ్వరరావు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రూ. పదివేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల తండ్రిని కోల్పోయి క్యాన్సర్ వ్యాధితో తల్లిని కోల్పోయిన పులిగడ్డ పంచాయతీ శివారు పల్లెపాలెం గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న రిషిత, ఇంటర్ చదువుతున్న శ్రావణి లకు బీసీ సంక్షేమ సంఘం కష్ణా జిల్లా ఉపాధ్యక్షు లు చెన్ను రంగారావు పదివేల ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం ఆ కుటుంబ సభ్యులను కలిసి వారి అమ్మమ్మకు ఈ నగదు సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు పులిగడ్డ ఇచ్చేశ్వరరావు, గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, నాగాయలంక మండల వైఎస్ఆర్సిపి యువ నాయకులు ఆకుల బాబి పాల్గొన్నారు.

శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థినికి బంగారు పతకం

ప్రజాశక్తి-చల్లపల్లి : దక్షిణ భారత దేశంలోనే తొలిసారిగా నిర్వహించిన కర్ర సాము పోటీల్లో చల్లపల్లి శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థిని వేరువేరు విభాగాల్లో బంగారు, సిల్వర్ పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ డి.సురేష్ తెలిపారు. ఈనెల నాలుగో తేదీన నెల్లూరులో నిర్వహించిన ఫస్ట్ సౌత్ ఇండియా కర్ర సాము ఛాంపియన్షిప్ 2023-24 పోటీలకు శ్రీ చైతన్య స్కూల్ నుంచి నాలుగవ తరగతి చదువుతున్న మోటుపల్లి మనోజ్ఞ మాన్వి పాల్గొనట్లు తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో జరిగిన 'స్టిక్ ఫైట్'లో మనోజ్ఞ మాన్వి విజేతగా నిలిచి బంగారు పతకం సాధించగా 'స్టిక్ కట్'లో సిల్వర్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మనోజ్ఞ మాన్వినుు శ్రీ చైతన్య స్కూల్ ఏ.జి.ఎం. మద్దినేని మురళీకష్ణ, రీజనల్ ఇంచార్జ్ జె.రాజేష్ బాబు, ప్రిన్సిపల్ డి.సురేష్, కోచ్ కె.వి.సుబ్బారావు, జాను, అధ్యాపక, అద్యాపకేతర సిబ్బంది తదితరులు అభినందించారు.

మొదటిపేజీ తరువాయి

కట్టింది లేదు... ఇచ్చిందీ లేదు

అవసరమైన రుణాలపై ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. మరో వైపు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ఆసక్తి కనబరచడం లేదు. బ్యాంకులపై ఒత్తిడి తేవడంలో కానీ రుణాలు మంజూరు చేయించడంలోను అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది వరకు ప్రభుత్వం తీసుకున్న రుణాలు టిడ్కో గృహాలకు గుదిబండగా మారాయని, వాటిని సక్రమంగా చెల్లించకపోవడంతో లోన్‌లు ఇచేందుకు బ్యాంకర్లు ముందుకు రావడం లేదని ఆక్షేపిస్తున్నారు. మరో వైపు రుణాలు తప్ప వేరే గత్యంతరం లేదు. ప్రభుత్వం ఒప్పించి మంజూరు చేయిస్తే తప్ప టిడ్కో ఇళ్లు పూర్తి చేయలేమని తేల్చి చెబుతున్నారు.

సాంప్రదాయ, ఆధునిక వైద్యాన్ని సమన్వయం చేయాలి

పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ శీలం భారతి, రాష్ట్ర డైరెక్టర్ అఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం, ఆర్డీవో ఎం.వాణి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిశీలకులు ధీరజ్ కుమార్, యువ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నర్సింగ్ డిప్యూటీ డైరెక్టర్ వల్లీ, స్థానిక నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రోజారమణి, మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆశాలత, జిజిహెచ్ సూపరింటెండెంట్ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నేతలపై అక్రమ కేసులు దుర్మార్గం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

విజయవాడ: అంగన్వాడీ కార్యకర్తల ఉద్యమంలో పాల్గొన్నందుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అక్రమ కేసులు బనాయించడంతో ఆయన సోమవారం కోర్టుకు హాజరయ్యారు. అంగన్వాడి కార్యకర్తల 42 రోజుల సమ్మె నేపథ్యంలో బాబూరావును పోలీసులు అరెస్ట్ చేసి మైలవరం పోలీస్‌స్టేషన్ లో ఒకరోజు పాటు నిర్బంధించారు. ఎఫ్ఐఆర్ 14 నెంబర్‌తో కేసు నమోదు చేసి ఆయనపై అక్రమంగా 120(బి), 143, 153, 290, 506 రెడ్‌విత్ 149 ఐపిసి సెక్షన్లతో కేసు బనాయించి గత నెల 22వ తేదీన కోర్టుకు హాజరు పర్చి, కోర్టు బెయిల్‌పై ఆయన్ను విడుదల చేశారు. దీనికి సంబంధించి విజయవాడలోని మూడవ అదనపు కోర్టు మెజిస్ట్రేట్‌లో వాయిదాకు బాబూరావు సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వాలు అణిచివేత ప్రయోగించడం, ప్రజల తరపున పోరాడిన నేతలపై కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. అంగన్వాడి కార్యకర్తలు చేసిన ఆందోళనకు మద్దతుగా నిలిచిన వారిపై అక్రమ కేసులు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పడం సమంజసం కాదని, ప్రభుత్వం ఇటువంటి విధానాలు మానుకోవాలని అన్నారు. ప్రజల తరపున సిపిఎం ఎప్పుడూ పోరాడుతుందని తెలిపారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్‌కు ఎపివిటియుఎస్‌సి వినతి

విజయవాడ: విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ (ఎపివిటియుఎస్‌సి) రాష్ట్రవ్యాప్త కార్యాచరణలో భాగంగా సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, నేరుగా వేతనాలు చెల్లించాలని, వేతనాలలో వ్యత్యాసాన్ని నివారించాలని, 2022 వేతనాల ఎరియర్స్ చెల్లించాలి, పెండింగ్లో ఉన్న మరణించిన కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు పూర్తి చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ నాయకులు ఎల్.రాజు, పి.అనిల్ కుమార్, వి.బి.కోటేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్, విటిపిఎస్ స్ట్రగుల్ కమిటీ నాయకులు యం.మోహనరావు, ఎస్‌కె.షంషేర్‌వలీ, ట్రాన్స్‌కో నాయకులు శ్రీనివాస్, రమణ ప్రసాద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
విజయవాడ బ్రాంచి ఆఫీసులు -
-బోడెమ్మ హోటల్ ప్రక్కన, బి ఆర్ పి రోడ్, 1 టౌన్.
-శ్రీ కృష్ణ నిలయం, బ్యాంక్‌ఆఫ్ బరోడా పైన, ఏలూరు రోడ్డు, గవర్నర్‌పేట.
- జమ్మిచెట్టు సెంటర్, మోడరన్ అకాడమీ కాలేజి ప్రక్కన, మొఘల్‌రాజపురం.
- # 43-144-5, ఫస్ట్‌ఫ్లోర్, పైపులరోడ్డు, రామాలయం గుడి ఎదురు, అజిత్‌సింగ్‌నగర్. ఫోన్ : 9121591614

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 24-02-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1260.0 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
VIJAYAWADA AREA CELL NO- 80088 12798

NOTICE

BEFORE THE HONOURABLE CO-OPERATIVE TRIBUNAL OF ANDHRA PRADESH AT : VIJAYAWADA
O.P. No. 22 of 2023

Between:
Peoples Mutually Aided Co-operative Credit Society Limited., represented by its authorised signatory Uppalapati B.V.S.S.Reddy. ...Petitioner
AND
1. Mudraboyina Venkata Durga Rao
2. Jasti Rajesh ...Respondents.

To
1.Mudraboyina Venkata Durga Rao, Son of M. Sambaiah, Hindu, aged about 41 years, properties, Resident of DRWA-770, H.No.299, Street No.640, Devi Nagar, Vijayawada-520003.
2. Jasti Rajesh, S/o J.Sivaji Kumar, Hindu, aged about 44 years, properties,Resident of D. No.4I -3-78, F No SF3, Tejaswi, Satyam Hotel, KrishnaLanka, Vijayawada-520002.

You are hereby informed that in the above suit you have to appear before the above Honourable Court, on 19-02-2024, at 10.30 a.m. either in person or through your advocate. In case of your non appearance before the above Honourable Court, the matter will be adjudicated in your absence.

B.O.
U.R.P.Srinivas, Advocate,
F-1, Ankur Complex,
Governorpet, Vijayawada-2.
VIJAYAWADA,
Dt.05-02-2024.

జగ్గయ్యపేట పురపాలక సంఘం - ఎన్టీఆర్ జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

ROC No. 66/2024/E1/DMFT GRANt 2023-24 **Dt. 05-02-2024**

జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలో 1 DMFT పని నిధులతో రూ.45.00 లక్షలతో సి.సి.తో రోడ్లు, పనికి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లను కోరబడుచున్నవి. కావున సదరు ఇ-ప్రొక్యూరుమెంటు టెండర్లను ది. 06-02-2024వ తేదీ నుండి ది. 12-02-2024 తేదీ https://tender.apeprocurement.gov.in/ ద్వారా దాఖలు చేసుకోవలసినదిగా తెలియజేయడమైనది.

Sd/- Commissioner
Jaggayyapet Municipality

అర్జీదారుల సంతృప్తే ప్రధానం : కలెక్టర్

విజయవాడ: స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని నాణ్యంగా, అర్జీదారులు పూర్తిస్థాయిలో సంతప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్, డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ రజనీ కుమారి తదితరులతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 160 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులతో పటిష్ట సమన్వయంతో అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు.

డాక్యుమెంట్స్ పోయినది

కృష్ణాజిల్లా, కోడూరు మండలం, మందపాకల గ్రామానికి చెందిన బాసు కనకదుర్గ, భర్త : గోపాలకృష్ణ (లేటు)కు సంబంధించిన సర్వే నెం. 511/1లోని య. 1-50 సెంట్లకు సంబంధించిన డాక్యుమెంట్ నెం. 1388/1981 పోయినది. ఇటీవల అవనిగడ్డ నుండి కోడూరు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గమధ్యలో పడిపోయినవి. ఎవరికైనా దొరికిన యెడల దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగలరు. లేదా తన ఫోన్ నెం. 9348987818కు ఫోన్ చేసి చెప్పగలరు.

ఇట్లు
బాసు కనకదుర్గ, భర్త : గోపాలకృష్ణ,
మందలపాకల, కోడూరు మండలం.

పేరు మార్పు

నేను పిట్టల మంజుల రాణి D/o పిట్టల భాస్కరరావు, నివాసం : బ్లాక్ నెం. 233, SF-3, JNNURM కాలనీ, జక్కంపూడి, విజయవాడ. నా యొక్క పూర్వపు పేరు పిట్టల మంజుల రాణి. వివాహం అనంతరం నా పేరును జ్యోతిష్యం ప్రకారం దేవనబోయిన వాణిగా మార్పు చేయటం జరిగింది. కావున నేటి నుండి నా పేరును **దేవనబోయిన వాణి (DEVANABOINA VANI)**, W/o దేవనబోయిన కోటేశ్వరరావు **(DEVANABOINA KOTESWARA RAO)** గా పిలవబడును.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటున్నూ, హైదరాబాద్, జియాగూడా, ఈస్ట్ వెంకటేశ్వరనగర్ కాలనీ, డోరు నెం. 13-6-603/బి కాపురస్తుడు వేణుగోపాల్ జోషి, తండ్రి : (లేటు) భవర్‌లాల్ జోషి, హాల్‌మకాం, మార్వాడి గుడివీధి, విజయవాడ-1 గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

నా క్లయింటు గారి తల్లిగారైన రాధాబాయిజోషి, భర్త : (లేటు) భవర్‌లాల్ జోషి గారి పేరున విజయవాడ-1 టౌన్, మార్వాడి గుడివీధి, డోరు నెం.11-56-49గా గల స్థిరాస్తికి సంబంధించిన క్రయ దస్తావేజు నెం. 2556/1981గా విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిష్టర్ కాబడిన దస్తావేజు మరియు వారి కుటుంబము తాలూకు అనగా భవర్‌లాల్ జోషి గారి పేరున గల డోరు నెం. 11-56-9 మరియు లతా జోషి గారి పేరున గల డోరు నెం. 11-56-27 గా గల మార్వాడి గుడివీధిలో గల స్థిరాస్తి బిల్డింగుల తాలూకు క్రయ దస్తావేజులు మరియు భవర్‌లాల్ జోషి, తండ్రి : (లేటు) మోహన్‌లాల్ జోషి గారి పేరున రాజస్థాన్ రాష్ట్రం, నాగోర్‌జిల్లా, మార్వార్ మూండ్వా గ్రామంలో గల నూరా (ఔట్‌హౌస్) స్థిరాస్తి తాలూకు క్రయ దస్తావేజులు మార్వాడి గుడి సందులోని యింటిలో ది.01-02-2024వ తేదీన చూసుకొనగా కనబడలేదు. ఎక్కడ వెదికిననూ కనబడలేదు. కావున ఎవరికైనా పై తెలిపిన దస్తావేజులు ఒరిజినల్స్ గల కవరు దొరికిన యెడల పై తెలిపిన అడ్రస్సునకు గాని నా అడ్రస్సునకు గాని అందించవలసినదిగా యావన్మందికి తెలియజేయడమైనది.

ఇట్లు
కోట రామకృష్ణ, బి.కాం., ఎం.ఎల్.,
న్యాయవాది,
డోరు నెం. 14-20-26రు, ఫస్ట్‌ఫ్లోరు,
విజయవాడ. **గాంధీనగర్, విజయవాడ-3.**
ది.4-2-2024 **సెల్ : 9440331239.**

మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఎస్.సి.ఓ.పి. నెం. 7/2023

బిట్వీన్ :
1) కురిచేటి వెంకట కృష్ణప్రసాద్
2) కురిచేటి త్రివిక్రమ శ్రీనివాస ప్రసాద్
.... పిటీషనర్లు

మరియు

ది బ్రాంచ్ మేనేజర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జవ్వారుపేట బ్రాంచి, మచిలీపట్నం
.... రెస్పాండెంట్

పై పిటీషన్‌లో పిటీషనర్లు వారి తండ్రిగారైన కురిచేటి (లేటు) రామచంద్రరావుగారు వారి జీవితకాలంలో కార్పొరేషన్ బ్యాంక్ మచిలీపట్నం (ప్రస్తుతం యూనియన్ బ్యాంక్) జవ్వారుపేట బ్రాంచి నందు యీ దిగువ షెడ్యూలు దాఖలా మొత్తమును ఫిక్స్‌డు డిపాజిట్స్ మరియు సేవింగ్ ఖాతా నందు జమ చేసియున్నారు. సదరు రామచంద్రరావుగారు మరణించిన మీదట వారి కుమారులు అయిన 1, 2 పిటీషనర్లు సదరు షెడ్యూలు దాఖలా మొత్తమును తీసుకొనుటకు శ్రీ కోర్టువారి నుండి సక్సెషన్ సర్టిఫికెట్ ఇప్పించవలసినదిగా కోరియున్నారు. కావున సదరు పిటీషన్ దాఖలా షెడ్యూలు చరాస్తులపై ఎవరికైనా అభ్యంతరములు వున్న యెడల ది. 22-02-2024న ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట హాజరై తెలుపగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

షెడ్యూలు దాఖలా చరాస్తులు :

1) FDR No. 288071 New Deposit ID No. 530101001452839 Dt : 3-4-2006 - Rs. 4,00,000/-
2) FDR No. 288072 New Deposit ID No. 530101001452847 Dt : 3-4-2006 - Rs. 4,00,000/-
3) FDR No. 288073 New Deposit ID No. 530101001452855 Dt : 3-4-2006 - Rs. 2,00,000/-
4) FDR No. 288074 New Deposit ID No. 530101001452863 Dt : 3-4-2006 - Rs. 4,00,000/-
5) S.B. Account No. 021400201000112, New A/c No. 510101000742812 Rs. 1,09,846-26/-

టోటల్ : Rs.15,09,846-26/-

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

మచిలీపట్నం.
ది.4-2-2024 **వి.జగతిశ్రీ**
న్యాయవాది, మచిలీపట్నం

గ్రామ పంచాయితీ కార్యాలయము-పురిటిగడ్డ
టెండరు నోటీసు

రి.క.నెం.**09/2024** తేది: **02-2-2024**

కృష్ణాజిల్లా, చల్లపల్లి మండలం, పురిటిగడ్డ గ్రామ పంచాయతీ లో దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా పనులు చేయుటకు రోజువారి వేతనంపై కాంట్రాక్టు పద్ధతిపై ది.1-4-2024 నుండి ది.31-3-2025 వరకు అనగా ఒక సంవత్సర కాలము పనిచేయుటకు అర్హులైన వారి నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను ది.09-02-2024వ తేదీన మధ్యాహ్నం 3.00 గం.ల నుండి సాయంత్రం 4.00 గం.ల వరకు గ్రామపంచాయతీ కార్యాలయము నందు పంచాయతి కార్యదర్శిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు స్వీకరించబడును. టెండర్లు నిర్ణీత ధరావత్తు చెల్లించి రశీదును టెండరుకు జతపర్చవలెను. వచ్చిన టెండర్లు అదేరోజు సాయంత్రం 4.30 గం.లకు టెండరుదారు సమక్షంలో తెరువబడును. ఇతర వివరములు గ్రామపంచాయతీ కార్యాలయము పనిచేయు వేళలలో తెలుసుకొనవచ్చును.

టెండరు షెడ్యూలు

వ.నెం.	పని వివరము	చెల్లించవలసిన ధరావత్తు
1.	గ్రామపంచాయతీ రక్షిత మంచినీటి పథకం మోటారు ఆపరేటరు -1	రూ. 1000/-లు
2.	గ్రామపంచాయతీ ఏరియాలో వీధిలైట్లు రిపేరుల చేయుట ఎలక్ట్రీషియన్-1	రూ. 1000/-లు
3.	గ్రామపంచాయతీ ఆఫీసులో స్వీపరుగా చేయుట- స్వీపరు-1	రూ. 1000/-లు

నోట్: సదరు టెండరు విషయంలో గతంలో అనుభవము వున్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. గ్రామపంచాయతీ నిధుల నిల్వలను బట్టి వేతనములు చెల్లించబడును.

పి.రాంబాబు,
పంచాయతీ కార్యదర్శి,
పురిటిగడ్డ గ్రామపంచాయతీ.

గ్రామ పంచాయితీ కార్యాలయము- చందర్లపాడు

రి.క.నెం.**01/2024** తేది: **05-2-2024**

బహిరంగ వేలం ప్రకటన

ఎన్టీఆర్‌జిల్లా, చందర్లపాడు మండలం, చందర్లపాడు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ది. 08-02-2024వ తేదీన గురువారం ఉదయం 11-00 గం.ల నుండి చందర్లపాడు గ్రామంలో గల స్టోరేజ్ గోడౌన్ (పాటెంపాడు) లీజు బహిరంగ వేలము విస్తరణ అధికారి పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి అధికారి చందర్లపాడు వారి సమక్షంలో పంచాయతీ కార్యదర్శి గారిచే నిర్వహించబడును.పాటలో పాల్గొనువారు ది. 08-02-2024వ తేదీన గురువారం ఉదయం 11-00 గం.ల లోపు వేలంపాట షరతులకు లోబడి 10,000-00 (అక్షరాల పదివేల రూపాయలు) డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనవచ్చును. డిపాజిట్టు చెల్లించని వారు పాట పాడుటకు అర్హత లేదు. ఏవైనా అనివార్య కారణాల వలన ఈ వేలం పాటను వాయిదా వేసే అధికారం వేలం నిర్వహణ అధికారి వారికి కలదు. ఇతర విషయములు ఆఫీసు పనివేళల యందు తెలుసుకొనవచ్చును.

వ.సంఖ్య	భవన వివరము	భవన విస్తీర్ణం	లీజు కాలపరిమితి	డిపాజిట్	సర్కారువారి కనిష్ట ధర
01.	నిలువ గిడ్డంగి (పాటేంపాడు)	2400 చ.అ.	1-04-2024 నుంచి 31-03-2025	10,000/-	1,30,000/-

సం/- కె.లక్ష్మయ్య
ఇ.ఓ పిఆర్ & ఆర్‌డి
చందర్లపాడు మండలం

సం/- ఎం.సాయిరామ్
పంచాయతీ కార్యదర్శి
చందర్లపాడు మండలం

బుసక తరలింపులో వివాదం

• నడకుదురు ఇసుక రేవు వద్ద ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి-చల్లపల్లి : కృష్ణానది రేవు నుంచి బుసక తరలింపు విషయంలో రెండు గ్రామాలకు చెందిన ప్రజల మధ్య సోమవారం వివాదం చోటుచేసుకుంది. చల్లపల్లి మండల పరిధిలోని పాగోలు గ్రామానికి చెందిన జగనన్న లే అవుట్లకు గత మూడు రోజుల నుంచి నడకుదురు ఇసుక రేవులో క్రేన్లతో తవ్వి వాహనాలతో బుసక తరలించకపోతున్నారు. అనుమతులు లేకుండా భారీ క్రేన్లు పెద్ద పెద్ద వాహనాలతో ఇసుక తరలించుకుపోతున్నారని నడకుదురు గ్రామస్తులు, రైతులు ఆదివారం తవ్వకాలను అడ్డుకున్నారు. మా గ్రామం నుంచి బుసుక తరలించకపోతే సహించేది లేదని తెగేసి చెప్పారు. బుసక తవ్వకాలు వల్ల పంట పొలాలు పాడైపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ బుసక తవ్వకాలకు బ్రేక్ పడింది. అయితే తాజాగా సోమవారం పాగోలు గ్రామానికి చెందిన కొందరు నటకుదురు ఇసుక రేవుకు వెళ్లి మరల బుసక తరలింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విషయం తెలుసుకున్న నడకుదురు గ్రామస్తులు, రైతులు తవ్వకం జరుపుతున్న ప్రదేశం వద్దకు వెళ్లి అడ్డుకున్నారు. దీంతో ఇరు ప్రాంతాలకు చెందిన ప్రజల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. బుసక తవ్వవద్దని నడకుదురు గ్రామస్తులు.. తవ్వుతామని పాగోలు గ్రామస్తులు భీష్మించుకు కూర్చోవడంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. దీంతో చల్లపల్లి తహసిల్దార్ బి.సుమతి , ఘంటసాల ఎస్సై ప్రతాపరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారి వాదనలు విన్నారు. ఈ ప్రాంతంలో పంట పొలాలకు దగ్గర్లో బుసక తవ్వకాలు చేపట్టటం వల్ల వరదల సమయంలో భూమి కోత ఎక్కువగా జరగటం వల్ల పంట పొలాలు నదీ గర్భంలో కలిసిపోతున్నాయని నడకుదురు వాసులు వివరించారు. పోటు సమయాల్లో సముద్రం వైపు నుంచి వస్తున్న ఉప్పునీరు పంట పొలాల్లోకి ప్రవేశించడం ద్వారా భూములు పాడైపోతున్నాయని రైతులు తాసిల్దారు ఎదుట వాపోయారు. ఈ ప్రాంతం సి ఆర్ జెడ్ పరిధిలో ఉండటం వల్ల ఇక్కడ బుసక తవ్వకాలు నిషేధించారని తాసిల్దారుకు వివరించారు. అయితే ఈ ప్రాంతం నుంచే తమకు బుసకతవ్వుకునేందుకు అనుమతులు ఇచ్చారంటూ పాగోలు వాసులు తెలిపారు. ఇరు వర్గాల వాదనలు విన్న అనంతరం తహసిల్దార్ సుజాత మాట్లాడుతూ ఇరు ప్రాంతాల వారు వారి వద్దనున్న డాక్యుమెంట్లు తీసుకుని ఆఫీసుకు రావాలని సూచించారు. సంబంధిత పత్రాలను పరిశీలించిన అనంతరం ఈ ప్రాంతంలో బుసక తవ్వాలా.. వద్దా... అనేది నిర్ణయిస్తామని స్పష్టం చేశారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఎం అభిమాని శేషగిరిరావు మృతి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం సొసైటీ పేటకు చెందిన సిపిఎం అభిమాని యార్లగడ్డ శేషగిరి రావు సోమవారం మతి చెందారు. భౌతిక కాయం దగ్గర సిపిఎం నాయకులు అనుమోలు వెంకటేశ్వరావు, వార్డ్ నెంబరు గుడిమెడ ఉదయ భాస్కర్, మాజీ ఉప సర్పంచ్ పఠాన్ సర్దార్, సిపిఎం మండల కార్యదర్శి మల్లం పల్లి ఆంజనేయులు, పార్టీ నాయకులు మిరప నాగేశ్వరరావులు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు కూడా పార్టీ మండల కమిటీ తరపున సానుభూతి తెలియజేసారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : పెడన నియోజకవర్గం లో సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ సోమవారం జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వ్యాస్ విలేఖర్లతో మాట్లాడుతూ పెడన నియోజకవర్గంలో బంటుమిల్లి కత్తివెన్ను మండలాల్లో కాలువల్లో గుర్రపు డెక్క పూర్తిగా పూడుకుపోవడం వల్ల తీర ప్రాంత గ్రామ తీవ్ర మంచి నీటి ఎద్దడికి గురి అవుతున్నారన్నారు. అరకొరగా వస్తున్న మంచినీరు పూర్తిగా కలుషితం అవ్వడం వల్ల ప్రజలు తీవ్రమైన మంచినీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వినతి ఇచ్చిన వారిలో జనసేన బందర్ నియోజక వర్గ ఇన్చార్జి బండి రామకష్ణ, గూడూరు మాజీ జెడ్పిటిసి బూరగడ్డ శ్రీ కుమార్, ఎక్స్ కౌన్సిలర్ కొట్టే వెంకట్రావు సుగుణ బాబు పాల్గొన్నారు.

కూడూరులో

'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-పెడన : మండల పరిధిలోని కూడూరు, కృష్ణాపురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి ఉప్పాల రాము సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని ప్రజల మౌలిక సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి త్వరలోనే వీటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజులపాటి వాణి, మార్కెట్ చైర్మన్ గరికిపాటి చారుమతి, వైసిపి మండల అధ్యక్షుడు కొండవీటి నాగబాబు, ఎంపీటీసీ సభ్యులు ఆకేం గిరిబాబు, బోల్లా ఉదయ్, శ్రీను దావు వైసిపి నాయకులు దావు, బైరవలింగం, రక్తసి వెంకటరామయ్య, ఊచ సత్యనారాయణ, పరస నరసింహారావు, కాగిత శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

'బాపూజీ' ఎన్నిక పట్ల హర్షం

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలంలోని వెంట్రప్రగడ ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షుడిగా బొగ్గ వరపు బాపూజీని ఎన్నుకున్నట్లు జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు ఏల్చూరి వేణుగోపాలరావు సోమవారం తెలియజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ వెంట్రప్రగడ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన ఎన్నికలలో ఆర్యవైశ్యులందరూ బొగ్గవరపు బాపూజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. బాపూజీ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యల పట్ల ప్రత్యేక దష్టి సారించి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ పి ఆర్ఓడి కోటేశ్వరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలువురికి సన్మానం

ప్రజాశక్తి-గూడూరు : నూతనంగా నియమితులైన గూడూరు పిఎసిఎస్ అధ్యక్షులు కారుమంచి కామేశ్వరరావు, కెడిసిసీ బ్యాంక్ డైరెక్టర్ మోటేపల్లి రత్నా రావు సోమవారం పెడన పట్టణం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెడన నియోజకవర్గ శాసనసభ అభ్యర్థి ఉప్పాల రామును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురిని రాము శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు సంఘ మధుసూదన్ రావు, గూడూరు మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అధ్యక్షులు పర్ణం మహా లక్ష్మయ్య నాయుడు, గరికపాటి రామానాయుడు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున టిడిపిలో చేరారు. గన్నవరంలో ఆదివారం సాయంత్రం తెలుగుయువత ఆధ్వర్యంలో నిర్వహించిన యువదళం బహిరంగ సభలో పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు కార్యకర్తలు జిల్లా టీడీపీ అధ్యక్షులు కొనకళ్ల నారాయణ, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి మహాసేన రాజేష్ ల సమక్షంలో టిడిపిలో చేరగా వారికి గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు పార్టీ కండువా కప్పి వారిని పార్టీలో చేర్చుకున్నారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురం ఎంపీటీసీ జోగా మల్లీశ్వరి, బాపులపాడు మండలం దంటకుంట్ల గ్రామ సర్పంచ్ యజ్జవరపు వెంకట రంగారావు, ఉపసర్పంచ్ పల్లి రవిబాబు, ఆర్.బి.కె అధ్యక్షులు యజ్జవరపు శ్రీనివాసరావు, మాజీ గ్రామ వైసిపి అధ్యక్షులు యజ్జవరపు సత్యనారాయణ, పలువురు వార్డు సభ్యులు నాయకులు సుమారు 50 మంది టిడిపిలో చేరారు. బొమ్మలూరు గ్రామానికి చెందిన పాతూరి క్రాంతికుమార్, సొంగ నవదీప్, తదితరులు 30 మంది టిడిపిలో చేరారు. కొయ్యూరు గ్రామ సర్పంచ్ కొల్లి సత్యనారాయణ (నాని) తదితరులు 15 మంది టిడిపిలో చేరారు.

బిళ్లనపల్లి గ్రామానికి చెందిన తోట శ్రీను, ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామానికి చెందిన మాగంటి రంగారావు తదితరులు 20 మంది, కేసరపల్లి గ్రామ వైసీపీ యూత్ అధ్యక్షులు బేతాళ ఈశ్వర్, జక్కులనెక్కలం గ్రామానికి చెందిన కే.డి. సి.సి బ్యాంక్ డైరెక్టర్ కాట్రు శ్రీనివాసరావు, గన్నవరం గౌడపేటకు చెందిన ఆకాష్, తదితరులు 23 మంది టిడిపిలో చేరారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పరిశీలన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని పలు గ్రామ సచివాలయాల వద్ద నిర్వహిస్తున్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లను తహసీల్దార్ ఏ. శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. వడ్లమన్నాడు, వేమవరం, కవుతరం, గుడ్లవల్లేరు రిజిస్ట్రేషన్ సెంటర్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2224 ఇళ్ల పట్టాలను మంజూరు చేశామని, ప్రస్తుతానికి 495 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కనకదుర్గ, కార్యదర్శులు, ఏ జేఎల్ నరసింహారావు, సిహెచ్ మహేశ్వర రావు, వీఆర్వోలు ప్రకాష్, రంగారావు, మల్లికార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్ఒకు సత్కారం : దశాబ్ద కాలం పైబడి మండలంలో రెవెన్యూ సేవలందించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్థానిక వీఆర్వో ప్రకాష్‌ను స్థానిక జై

భీమ్ యువజన సేవా సంఘం, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ తరపున సంయుక్తంగా ఘనంగా సోమవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో గోట్రు నాగబాబు, కొల్లిపర అనసూయ, డిప్యూటీ తాసిల్దార్ కనకదుర్గ, పంచాయతీ కార్యదర్శి ఎజేఎల్ నరసింహారావు, కే.రంగారావులు వీఆర్వో ప్రకాష్ కు అభినందనలు తెలిపారు.

లక్ష్మీపురంలో సిసి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-చల్లపల్లి : అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సహకారంతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం లక్ష్మీపురం శివారు రామానగరం 12వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.16 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరావు, ఆర్ఐ ఘంటసాల కష్ణమోహన్, గ్రామ ప్రముఖులు కళ్లేపల్లి బలరాం, కోమటి శ్రీనివాసరావు, తుమ్మల వెంకయ్య పాల్గొన్నారు.

వైసిపితోనే

సంక్షేమం సాధ్యం: ఎంఎల్ఎ

ప్రజాశక్తి-పమిడిముక్కల : వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నవరత్నాలతో భాగంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తోందని పామర్రు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని చోరగుడి శివారు గోపాలకష్ణపురంలో చెరువు పోరంబోకుకు సంబంధించి పట్టాలు పేదలకు పంపిణీ చేశారు. అనంతరం సిమెంట్ రోడ్డు, గంగానమ్మ గుడి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవ మల్లేశ్వరరావు, చోరగుడి ఎంపీటీసీ సభ్యులు దుర్గారావు, నాగరాజు, మాతంగి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ కైలే అనిల్‌కుమార్

'మహాశక్తి' పథకంతో భరోసా :

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : మహాశక్తి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళందరికీ టీడీపీ భరోసా కల్పిస్తోందని రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి అన్నారు. బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామంలో టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో కళ్యాణి పర్యవేక్షణలో మహిళా కమిటీని ఏర్పాటు చేశారు. మల్లవల్లి మహిళా కమిటీ అధ్యక్షురాలిగా అక్కినేని స్వరూపరాణి, కార్యదర్శిగా గజ్జల రంగమ్మ లతో పాటు 10 మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాయి కళ్యాణ్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి టీడీపీ మేనిఫేస్టోలో ప్రకటించిన పథకాలను ప్రతి ఇంటికి వివరించాలన్నారు. ఈ సమావేశంలో తెలుగు మహిళ కష్ణా జిల్లా అధికార ప్రతినిధి వడ్డిల్లి లక్ష్మీ, టీడీపీ నాయకులు వెంకట్రావు, అక్కినేని ధర్మరాజు, పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల్లో మంచి

ఉత్తీర్ణత సాధించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : విద్యార్థి, విద్యార్థులు ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఎంఈఓ 1 జగన్మోహనరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఎంఈఓ 1 జగన్మోహన్రావు, ఎంఈఓ 2 గోపాల రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంఈఓ లు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి కావున ఉపాధ్యాయులంతా విద్యార్థులకు సులువైన మార్గంలో విద్యాబుద్ధులు అందించాలని సూచించారు. అలాగే ప్రతి పాఠశాలలో వంట గదులు క్లాస్ రూములు పరిసరాలు శుభ్రపరచుకోవాలని కోరారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అటెండెన్స్ పెరిగే విధంగా కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌతరం ప్రధానోపాధ్యా యురాలు పద్మావతి, మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పందనలో మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

సమస్యకు సత్వర పరిష్కారం కోసమే స్పందన: మేయర్

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజల సమస్యలకు పరిష్కార వేదికగా నిలిచే స్పందన కార్య క్రమం సోమవారం ఉదయం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూములో నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలకు అధికారుల సమక్షంలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. సోమవారం విజయవాడ నగర పాలక సంస్థలో జరిగిన కార్యక్రమంలో 13 ఫిర్యాదులు స్వీకరించారు. అందులో ఇంజనీరింగ్ 3, మెడికల్ ఆఫీస్ 1, టౌన్ ప్లానింగ్ 6, రెవిన్యూ 3 మొత్తం 13 ఫిర్యాదులు వచ్చాయి.

పిఎంజె జ్యూయలరీ ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : జ్యూయలరీ రంగంలో అగ్రగామిగా ఉన్న పిఎంజె జ్యూవెల్స్ ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ వివంతలో హాస్ శారీ అండ్ వెడ్డింగ్ జ్యూవలరీ ఎగ్జిబిషన్ సోమవారం ఉదయం ప్రారంభమైంది. ప్రదర్శనను మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గద్దె అనూరాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడ మహిళల కోసం ప్రత్యేకంగా పిఎంజె జ్యూవెల్స్ ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో జ్యూయలరీ ఎగ్జిబిషన్ ఏర్పాటుచేయడం అభినందనీయమని తెలిపారు. రానున్న పండుగలు, శుభకార్యాలు సందర్భంగా వీటిని ఏర్పాటుచేశారని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిఎంజె జ్యూవెల్స్ అధినేత హైదర్ అలీ మాట్లాడుతూ విజయవాడలో ఏర్పాటు చేసిన ప్రదర్శనకు మంచి స్పందన లభిస్తుందన్నారు.

ఆసీఫ్‌కు సంఘీభావం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ పశ్చిమ నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి షేక్ ఆసిఫ్‌ను సోమవారం పాతబస్తీ పంజా సెంటర్‌లో గల ఆయన కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీలు, ఆంధ్రప్రదేశ్ ఫకీర్ ముస్లిం కమిటీ వారు మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం ప్రకటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అభివద్ధి పథకాలను రాష్ట్రంలో మైనార్టీలు చాలా సంతోషంగా ఉన్నారని, రాబోవు ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి ముఖ్యమంత్రిగా, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా షేక్ ఆసిఫ్‌ని మైనార్టీలు పూర్తి మద్దతుతో గెలిపించుకుంటామని ఆంధ్రప్రదేశ్ ఫకీర్ ముస్లిం కమిటీ వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు షేక్ ఇమామ్ వలి, సైదాబీ, గొల్లపూడి పదో సెగ్మెంట్ ఎంపిటిసి షేక్ ఇమామ్ వలీ పాల్గొన్నారు.

ఆసీఫ్‌కు సంఘీభావం తెలుపుతున్న ఫకీర్ ముస్లీం కమిటీ సభ్యులు

విద్యార్థులు అన్ని రంగాలపై ఆసక్తి పెంచుకోవాలి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాలపై ఆసక్తి పెంపొందించుకుని ముందుకు వెళ్లాలని ప్రముఖ వ్యాపారవేత్త, థంశా గ్రూప్ సిఇఒ శ్రీనివాస్ వుడి అన్నారు. నగరంలోని ఎంవిఆర్ ఇంజనీరింగ్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో 'డిఎన్ఎ ఆఫ్ సక్సెస్' అనే అంశంపై సోమవారం సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్‌లో చేరిన ప్రతి విద్యార్థి మొదటి సంవత్సరం నుండే వారి లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని దానికి అనుగుణంగా కృషి చేయాలన్నారు. అయితే కొన్ని కొన్ని సందర్భాల్లో అటంకాలు కూడా ఎదురుకావచ్చినా వాటిని భయపడకుండా ముందుకు సారిగే విజయం సాధిస్తారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు ముందుగా లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించే క్రమంలో ఆందోళనలకు గురవుతారని అలా కాకుండా ప్రతి ఒక్కరూ సత్మార్గంలో నడవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ పోటీలకు సంబంధించి ఏ విధంగా విజయం సాధించాలని, ప్రణాళికా రచనలపై ఆయన కూలంకుషంగా వివరంచారు. ఎంవిఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్

సిఇఒ శ్రీనివాస్ వుడిని సన్మానిస్తున్న దృశ్యం

యు.ఏడుకొండలు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు విద్యతో పాటు అన్ని రంగాలపై ఆసక్తి కలిగించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించడంతో పాటు జాబ్ పేలస్‌మెంట్స్ నిర్వహించి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి వి.విజయకుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిఇఒ శ్రీనివాస్ వుడిని సన్మానించారు.

11న వ్యాపారాభివృద్ధిపై రాష్ట్రస్థాయి సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈ నెల 11న నగరంలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో బిఎన్ఐ ఎపి లార్జెస్ట్ నెట్‌వర్కింగ్ కాన్‌క్లేవ్ 2.0 నిర్వహిస్తున్నట్లు బిఎన్ఐ విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జై దేశాయ్, విశాల్ దేశాయ్ తెలిపారు. బిఎన్ఐ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పరస్పర సహకారంతో వ్యాపారాభివద్ధి లక్ష్యంగా రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహణకు సంకల్పించామన్నారు. ఏ రంగంలోనైనా నెట్‌వర్కింగ్ కీలక భూమిక పోషిస్తుందని, వ్యాపార రంగంలోనూ నెట్‌వర్కింగ్‌ను విస్తతం చేయడం ద్వారా అద్భుత ఫలితాలను ఆవిష్కరించొచ్చని చెప్పారు. వివిధ రంగాలకు చెందిన వారిని ఒక్కచోటికి చేర్చి, వారి నడుమ సుహద్భావ సంబంధాలను నెలకొల్పి, తద్వారా విస్తత వ్యాపార అవకాశాలను సష్టించేందుకు అద్భుతమైన వేదికగా నిలుస్తుందని అన్నారు. బిఎన్ఐ సభ్యులతో సహా మొత్తం 1,500 మంది ప్రతినిధులను సదస్సుకు ఆహ్వానించినట్లు వివరించారు. దేశంలో మొట్టమొదటి మహిళా ఐ.పి.ఎస్ అధికారి డాక్టర్ కిరణ్ బేడీ ప్రసంగం ఈ సదస్సుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చెప్పారు. బిఎన్ఐ జాతీయ డైరెక్టర్లు ఈ సదస్సుకు అతిథులుగా హాజరవుతారని అన్నారు. వ్యాపార విస్తతికి, వాణిజ్య అవకాశాల



సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

సృష్టికి బిఎన్ఐ ఎపి లార్జెస్ట్ నెట్వర్కింగ్ కాన్క్లేవ్ 2.0 వేదికగా నిలుస్తుందని జై దేశాయ్, విశాల్ దేశాయ్ తెలియజేశారు. నెట్‌వర్కింగ్ కన్‌క్లేవ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో నెట్‌వర్కింగ్ కన్‌క్లేవ్ ట్రెజరర్ త్రినాథ్ నండూరి మాట్లాడుతూ ఈ సదస్సులో ఎపి ఛాంబర్, విజయవాడ ఛాంబర్, డెంటల్, ఇంటీరియర్స్, ఆర్కిటెక్చర్, రోటరీ, సిఎ, బిల్డర్, ఇంజినీర్స్ అసోసియేషన్స్ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. విలేకరుల సమావేశంలో బీఎన్ఐ కన్‌క్లేవ్ చైర్మన్ మద్దినేని శ్రీనివాస్, ట్రెజరర్ త్రినాద్ నండూరి, కన్వీనర్ మేఘన ఆచంట తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీలో డాలీ శివానీకి బంగారు పతకం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ఈ నెల 1వ తేదీ నుండి 4వ తేదీ వరకు అమెరికాలోని లాస్‌వెగాస్‌లో జరిగిన సౌత్ పాయింట్ ఆర్చరీ ప్రపంచ స్థాయి పోటీల్లో నగరంలోని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమికి చెందిన చెరుకూరి డాలీ శివానీ ఉమెన్ రికర్వు విభాగంలో బంగారు పతకం సాధించిందని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమి అధ్యక్షులు చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా అకాడమిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని డాక్టర్ కె.కె.ఆర్ గౌతమ్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతన్న డాలి శివానీ చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమిలో శిక్షణ పొందుతూ యుఎస్ఎ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొందని తెలిపారు. 12 సంవత్సరాల విభాగంలో జరిగిన ఈవెంట్‌లో 30 ప్లస్ 30 యూరో షూట్‌లో 300 పాయింట్లకు గానూ 290 ప్లస్ 2679 పాయింట్లు సాధించిందన్నారు. 600 పాయింట్లకుగాను 579 పాయంట్లు సాధించి నెంబర్ వన్ ర్యాంకర్‌గా అగ్రస్థానంలో నిలిచిందన్నారు. తొలిసారిగా 12 ఏజ్ విభాగంలో ప్రపంచ స్థాయి అగ్రగామి పోటీలలో భారత్‌కు చెందిన చెరుకూరి డాలీ శివానీ బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. 1000 డాలర్ల స్కాలర్‌షిప్‌ను యుఎస్ఎ వరల్డ్ ఆర్చరీ చెక్ చీఫ్ గెస్ట్ ద్వారా

అందుకుందని తెలిపారు. చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమి చెందిన జి.వెంకట సాయి మణిదీప్ రెడ్డి యంగ్ అడల్ట్ రికర్వు ఆర్చరీ విభాగంలో 5వ ర్యాంకును, పి.చరణ్ శ్రీకర్ కాంపౌండ్ విభాగంలో 21వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. బి.ప్రియ వైష్ణవి యంగ్ అడల్ట్ కాంపౌండ్ ఆర్చరీ యూత్ మ హిళా విభాగంలో 80వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. మరో క్రీడాకారుడు కొత్తపల్లి హర్షిక్ ఆర్చరీ క్లబ్ రికర్వ్ ఉమెన్ విభాగంలో 35 వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. వీరికి శిక్షకులుగా చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమి చీఫ్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ, కోచ్‌లు యం.సి.హెచ్. ఫణిభూషణరావు, టి.రవిచంద్ర, ఉన్నారని, చెరుకూరి కృష్ణకుమారి, కోత్తపల్లి అరుణ్‌కుమారిలు మేనేజర్లుగా వ్యవహరించారని తెలిపారు.

'గడపగడపకూ మన ప్రభుత్వం'లో వెలంపల్లి

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం భూకబ్జాలు, దందాలు, రౌడీయిజం లేకుండా ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు రాబోయే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి అయిన తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి, పశ్చిమ నియోజకవర్గ ఎంఎల్ఎ వెలంపల్లి శ్రీనివాసరావు ఓటర్లను కోరారు. స్థానిక నియోజకవర్గంలోని సత్యనారాయణపురం పరిధిలో 33వ డివిజన్‌లో వైసిపి ఆధ్వర్యంలో సోమవారం ప్రతి గడపకూ మన శ్రీనన్న కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగింది. వైసిపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక కార్పొరేటర్ విఎన్‌డిఎస్ఎస్ మూర్తి (శర్వాణీ మూర్తి)తో కలసి వెలంపల్లి శ్రీనివాసరావు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్స రాల కాలంలో వైసిపి ప్రభుత్వం ప్రకటించిన నవరత్నాలు నూటికి 99 శాతం అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు.

సర్పంచ్ పుల్లమ్మను అరెస్టు చేసిన దృశ్యం

సర్పంచ్ హౌస్ అరెస్టు

ప్రజాశక్తి - గంపలగూడెం: రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లగా సర్పంచులు ఖాతాల్లో సొమ్ము లేక, పంచాయతీలలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేక అతలాకుతలమవుతున్న నేపథ్యంలో సర్పంచుల సంఘం రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా సర్పంచులు విజయవాడ వెళ్లడానికి ముందే స్థానిక పోలీసులు హౌస్ అరెస్టు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా గంపలగూడెం పట్టణ పంచాయతీ సర్పంచ్ కోటపుల్లమ్మను సోమవారం రాత్రి హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పుల్లమ్మ మాట్లాడుతూ సమస్యలు తీర్చాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే నేపథ్యంలోనే సర్పంచులను అరెస్టు చేయటం దారుణమన్నారు. ప్రభుత్వం అణిచివేతకు ప్రయత్నం చేస్తుందని, ఈ విధానం భవిష్యత్తుకు మంచిది కాదని అన్నారు.

ఆసియా హాస్పటల్స్‌కు క్యూఎఐ గుర్తింపు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ది క్వాలిటీ అండ్ అక్రెడిటేషన్ ఇనిస్టిట్యూట్ (క్యూఏఐ) గుర్తింపుతో ఆసియా హాస్పటల్స్ పలు కార్యక్రమాలను నిర్వహిస్తుందని సంస్థ సిఇఒ డాక్టర్ రాజీవ్ సింఘాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మరెంగో సిమ్స్ హాస్పటల్‌లో స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, క్వాలిటీ అండ్ పేషెంట్ సేఫ్టీ ఇన్ స్ట్రోక్ కేర్ స్థాపించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. దీని ద్వారా ఆరోగ్య సంరక్షణా వ్యవస్థను బలపరచడంపై దృష్టి కేంద్రీకరిస్తూనే స్ట్రోక్ సంరక్షణ చికిత్సను మెరుగుపరచేందుకు తమ భాగస్వామ్యం ఎంతగానో ఉపయోగపడతుందని తెలిపారు. రానున్న కాలంలో మరెంగో ఆసియా హాస్పటల్స్ నిర్వహణలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్పోర్ట్స్ ఫెస్ట్‌లో శరణం ధాత్రి విజయకేతనం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగిన స్పోర్ట్స్ ఫెస్ట్ నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనటానికి విజయవాడలోని కెఎల్ యూనివర్సిటీలో బిటెక్ చదువుతున్న విద్యార్థిని శరణం ధాత్రి కూడా పాల్గొన్నది. తాను 100 మీటర్స్ రిలేలో వెండి పతకం, 400 మీటర్స్ రిలేలో కాంస్య పతకం సాధించింది. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రస్టేట్‌లో యూనివర్సిటీలు పాల్గొన్నారు. ధాత్రి గతంలో అనేక పోటీల్లో విజయాలు సాధించిందని ఆమె తల్లిదండ్రులు కోటేశ్వరరావు, శిల్పా (దుర్గా)తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.